


పారిశుధ్యం మెరుగుకు కృషి

- మునిసిపల్ కమిషనర్ సురేంద్ర... బాధ్యతలు స్వీకరణ



సురేంద్ర

నర్సీపట్నం, ఆగస్టు 28: మునిసిపాలిటీలో పారిశుధ్యం మెరుగు, వీధి దీపాల సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని నూతన కమిషనర్ జంపా సురేంద్ర అన్నారు. జీవీఎంసీ ఏవోగా పని చేస్తూ.. ఇటీవల నర్సీపట్నం మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ అయిన బుధవారం ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, పట్టణంలో ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేస్తానని చెప్పారు.

మళ్లీ గోకులాలు!

పథకాన్ని పునరుద్ధరించిన కూటమి ప్రభుత్వం


- గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పశువులకు షెడ్ల నిర్మాణం
- ఉపాధి హామీ పథకం కింద 90 శాతం రాయితీ
- రైతులకు నిధులు ఇవ్వకుండా పథకాన్ని నీరుగార్చిన వైసీపీ పాలకులు
- ఈసారి మరింత మెరుగ్గా పథకాన్ని అమలుచేస్తున్న కూటమి ప్రభుత్వం
- పశువులతోపాటు జీవాలు, కోళ్ల పెంపకానికి కూడా షెడ్లు మంజూరు



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పశువుల కోసం నిర్మించిన షెడ్డు (ఫైల్ ఫొటో)

కోటవురట్ల, ఆగస్టు 28: పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో వున్నప్పుడు మినీ గోకులాల పథకాన్ని అమలు చేసింది. కానీ ఐదేళ్ల క్రితం అధికారాన్ని చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా అటకెక్కించింది. అంతేకాక సొంత సొమ్ముతో షెడ్లు నిర్మించుకున్న రైతులకు రాయితీ సొమ్ము చెల్లించలేదు. కాగా రైతులకు ఎంతో ఉపయోగకరమైన ఈ పథకాన్ని పునరుద్ధరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈసారి పశువులతోపాటు మేకలు/ గొర్రెలు, కోళ్లకు కూడా షెడ్లు మంజూరు చేస్తున్నది. యూనిట్ విలువతోపాటు సబ్సిడీని కూడా పెంచింది.

పాడి పశువులకు నీడ కోసం 2014-19లో అధికారంలో వున్న తెలుగుదేశం ప్రభుత్వం మినీ గోకులాల పథకాన్ని అమలు చేసింది. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద మూడు కేటగిరీల్లో షెడ్ల నిర్మాణానికి ప్రతిపాదించింది. ఉమ్మడి విశాఖ జిల్లాకు 4,950 మినీ గోకులాలను మంజూరుచేసింది. రెండు పశువులకు షెడ్డు నిర్మాణం కోసం రూ.లక్ష, నాలుగు పశువులు అయితే రూ.1.5 లక్షలు, ఆరు పశువులు అయితే రూ.1.8 లక్షల చొప్పున నిధులు కేటాయించింది. యూనిట్ విలువలో పది శాతం సొమ్మును మాత్రమే రైతులు చెల్లిస్తే సరిపోతుంది. దీంతో చాలా మంది రైతులు షెడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. 2019లో సాధారణ ఎన్నికలు జరిగేనాటికి ఉమ్మడి జిల్లాలో దాదాపు 60 శాతం మినీ గోకులాల పనులు ప్రారంభమయ్యాయి. ఎన్నికల తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో 25 శాతం కంటే తక్కువ పనులు అయిన మినీగోకులాలను నిలిపివేయాలని, పనులు ప్రారంభించని వాటిని రద్దు చేయాలని ఆదేశించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో 2,058 పనులను అధికారులు రద్దు చేశారు. 25 శాతం కంటే తక్కువ పనులు అయిన 2,104 మినీ గోకులాలను పెండింగ్‌లో పెట్టి, అంతకుమించి ... మిగతా 8వ పేజీలో



మంత్రి నారా లోకేశ్‌కు విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు. చిత్రంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ఉన్నారు

లోకేశ్‌కు ఘన స్వాగతం

- ఎయిర్‌పోర్టుకు భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
- కార్యాలయంలో రాత్రికి బస

విశాఖపట్నం , ఆగస్టు 28: రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ బుధవారం రాత్రి నగరానికి చేరుకున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి విశాఖ విచ్చేసిన ఆయనకు విమానాశ్రయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, విశాఖపట్నం, అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గాల పార్టీ అధ్యక్షులు గండి బాబ్జీ, బత్తుల తాతయ్యబాబు, పార్టీ నాయకులు కిడారి శ్రావణ్‌కుమార్, బుద్ద నాగజగదీశ్, దాడి రత్నాకర్, ప్రగడ నాగేశ్వరరావు, సీతంరాజు సుధాకర్, పీలా శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర్ ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, విశాఖపట్నం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, గోపాలపట్నం తహసీల్దార్ రమేష్, తదితరులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

కార్యకర్తలతో ఫొటోలు

ఎయిర్‌పోర్టులో లోకేశ్‌తో మాట్లాడి ఫొటోలు దిగేందుకు ఎక్కువమంది వచ్చారు. అయితే భద్రతా కారణాలతో సిబ్బంది వారిని దూరంగా ఉంచారు. ఇది చూసిన లోకేశ్ స్పందిస్తూ...వారిని వదిలేయండి...నేనే మేనేజ్ చేస్తానన్నారు. అప్పుడు భద్రతా సిబ్బంది అందరినీ లోకేశ్ వద్దకు అనుమతించడంతో వారందరితో ఫొటోలు దిగారు.

పార్టీ కార్యాలయంలో బస

ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా లోకేశ్ నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఆయనతోపాటు పల్లా శ్రీనివాసరావు, శ్రీభరత్, గండి బాబ్జీ తదితరులు ఉన్నారు. పార్టీ కార్యాలయం ఆవరణలో గల బస్సులో ఆయన రాత్రి బస చేశారు.

ఖరీఫ్‌పై నీలినీడలు!

ఆగస్టులో తీవ్ర వర్షాభావ పరిస్థితులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

- వరినాట్లుకు కీలకమైన సమయంలో కరుణించని వరుణుడు
- ఇంతవరకు సగం విస్తీర్ణంలో కూడా సాగుకాని పంటలు
- ఖరీఫ్‌లో వరి సాగు లక్ష్యం 1,32,802 ఎకరాలు.. నాట్లు వేసింది 68,710 ఎకరాల్లోనే!
- నిరాశాజనకంగానే చెరకు సాగు

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాగుపై నీలినీడలు కుమ్ముకున్నాయి. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొన్న అన్నదాతలు.. ఈ ఏడాది కూడా కరువుబారిన పడక తప్పదేమోనని ఆందోళన చెందుతున్నారు. మరో మూడు రోజుల్లో ఆగస్టు నెల ముగియనుంది. సాధారణంగా ఈ సమయానికి వరినాట్లు చివరి దశకు చేరకుంటాయి. కానీ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో.. ముఖ్యంగా ఆగస్టు నెలలో వరుణుడు ముఖం చాటేయడంతో వరినాట్లు పనులు ముందుకు సాగడం లేదు. అప్పుడప్పుడు చెదురుముదురుగా జల్లులు లేదా మోస్తరు వర్షం పడడం, తరువాత ఎండ తీక్షణంగా కాస్తుండడంతో పొలాల్లో నీరు నిలిచే పరిస్థితి లేకుండా పోయింది. మరోవైపు జలాశయాల్లో ఆయకట్టుకు నీటి వినియోగం పెరగడంతో, కాలువల చివరి భూములకు నీరు అందడం



బుచ్చెయ్యపేట మండలం పెదమదీనాలో వరి నాట్లు పడని పొలాలు

లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సకాలంలో నాట్లు వేయకపోతే వరి నారు ముదిరిపోయి, పనికిరాకుండా పోతుందని వాపోతున్నారు.

వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం 1.86 లక్షల ఎకరాలు. ఈ నెల 23వ తేదీ వరకు 85 వేల ఎకరాల్లో (45.7 శాతం) మాత్రమే వివిధ రకాల పంటలు వేసినట్టు చెబుతున్నారు. జిల్లాలో ప్రధాన పంట వరి. ఖరీఫ్‌లో 1,32,802 ఎకరాల్లో వరి సాగు చేస్తారని అంచనా వేయగా, ఈ నెల 23వ తేదీనాటికి 68,710 ఎకరాల్లో మాత్రమే నాట్లు పూర్తయ్యాయి. రెండేళ్ల క్రితం.. అంటే 2022లో ఆగస్టు 23వ తేదీ నాటికి 1,13,800 ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేయగా, ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న గత ఏడాది ఇదే సమయానికి 66,795 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం కొంతమేర మెరుగ్గా



రావికమతంలో వరి నాట్లు పడక ఖాళీగా వున్న పంట పొలాలు

వున్నప్పటికీ... సగటు విస్తీర్ణంతో పోలిస్తే నిరాశాజకంగానే వుంది. రైవాడ, కోనాం, పెద్దేరు జలాశయాల్లో నీరు బాగానే వున్నప్పటికీ, తీక్షణంగా కాస్తున్న ఎండల కారణంగా రెండు మూడు రోజులకు ఒకసారి వరి పొలాలకు నీరు పెట్టాల్సి వస్తున్నది. దీంతో కాలువ చివరి భూములకు నీరు చేరక, వరినాట్లు జాప్యం అవుతున్నాయి.

అనకాపల్లి సబ్ డివిజన్‌లో అధ్వానం..

అనకాపల్లి సబ్ డివిజన్‌లో వరి సాధారణ విస్తీర్ణం 16,267 ఎకరాలు కాగా వ్యవసాయశాఖ గణాంకాల ... మిగతా 8వ పేజీలో

బదిలీల కోసం...

ప్రజా ప్రతినిధులతో సిఫారసులు, ఫోన్లు

- దరఖాస్తుల స్వీకరణకు 24వ తేదీతో ముగిసిన గడువు
- వరుస సెలవులు వచ్చాయనే ఉద్దేశంతో ఇంకా స్వీకరణ
- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహణ
- ఎంపీడీవో పోస్టుల కోసం పలువురు పైరవీలు
- జిల్లాలో ఒకరిద్దరు తహసీల్దార్లకు స్థాన చలనం
- పౌరసరఫరాల శాఖలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులకు పోటీ



విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ శాఖల్లో బదిలీల హడావిడి మొదలైంది. కొత్త ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తరువాత తొలిసారి జరిగే బదిలీల్లో రాజకీయ జోక్యం ఎక్కువగా ఉంటుందనేది బహిరంగ రహస్యం. ప్రస్తుతం బదిలీ కోరుకునే అధికారులు, ఉద్యోగులు కూడా తమకు తెలిసిన వారి ద్వారా సిఫారసు చేయించుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ క్రమంలో మంత్రులు/ఎంపీలు/ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరైతే ఒకరి సిఫారసు లేఖతో సంతృప్తిచెందకుండా తమకున్న పలుకుబడి ఉపయోగించి ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేల నుంచి లేఖలు సంపాదిస్తున్నారు. ఆ లేఖలను సంబంధిత అధికారులకు సమర్పించడంతోపాటు అవి ఇచ్చిన ప్రజా ప్రతినిధులతో ఫోన్లు చేయించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా బదిలీలు జరగనున్నందున ఏజెన్సీ, మైదానం నుంచి ఎక్కువ మంది నగర పరిసరాల్లో పోస్టింగ్స్‌కు యత్నిస్తున్నారు.

ఒకేచోట ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న అధికారి/ఉద్యోగికి బదిలీ తప్పనిసరి. అయితే సర్వీస్‌తో నిమిత్తం లేకుండా బదిలీల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందుకు ఈనెల 24వ తేదీతో గడువు ముగిసినా వరుస సెలవుల కారణంగా దరఖాస్తులు ఇంకా స్వీకరిస్తున్నారు. ఈ నెలాఖరులోగా బదిలీలు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగంలో మంగళవారం అర్ధరాత్రి వరకు బదిలీలు నిర్వహించారు.

ఎంపీడీవో పోస్టులకు పైరవీ..

ఉమ్మడి జిల్లాలోని 39 మండలాల్లో ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న ఎంపీడీవోలు ఆరేడుగురు మాత్రమే ఉన్నారు. ఐదేళ్ల సర్వీస్ పూర్తికాకపోయినా పలువురు ఎంపీడీవోలు కీలక మండలాల్లో పోస్టింగ్‌కు యత్నిస్తున్నారు. దీనికి ప్రజాప్రతినిధుల నుంచి లేఖలు తెచ్చుకున్నారు. ప్రజా ప్రతినిధులు కూడా స్వయంగా రంగంలోకి దిగి తమకు అనుకూలంగా ఉండే ఎంపీడీవో నియామకం కోసం పట్టుపడుతున్నారు. అయితే జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆధ్వర్యంలోని కమిటీయే ఎంపీడీవోల నుంచి కిందిస్థాయి ఉద్యోగి వరకు బదిలీలు చేపట్టాలి. బదిలీల కోసం సుమారు 160 వరకు దరఖాస్తులు వచ్చాయని చెబుతున్నారు.

జిల్లాలో ఒకరిద్దరు తహసీల్దార్లకు స్థాన చలనం

రెవెన్యూ శాఖలో బదిలీల కోసం ఉమ్మడి విశాఖ జిల్లాలో 70 నుంచి 80 మంది దరఖాస్తు చేశారని తెలిసింది. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లు పలువురు విశాఖ రావడానికి ఆయా జిల్లా కలెక్టర్లకు దరఖాస్తు చేసుకున్నారు. ఏజెన్సీలో ఉన్న ఉద్యోగులు...ముఖ్యంగా 50 సంవత్సరాల వయస్సు పైబడినవారు మైదానం/నగరంలో పోస్టింగ్ ఇవ్వాలని కోరుతున్నారు. విశాఖ జిల్లాలో రెండు తహసీల్దార్ల పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. ఇంకా జిల్లాలో ఒకరిద్దరు తహసీల్దార్లకు బదిలీ ఉంటుందనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో పలువురు తహసీల్దార్లు రాజకీయ ... మిగతా 8వ పేజీలో

రైతులతో రెవెన్యూ చెలగాటం

అనాలోచితంగా 22 (ఏ)లో చేర్చడంతో ఇబ్బందులు

- రెండు దశాబ్దాల క్రితం 'బార్క్' రోడ్డు కోసం దొప్పెర్లలో ఏపీఐఐసీ భూ సేకరణ
- పలు సర్వే నంబర్లను నిషేధిత జాబితాలో చేర్చిన రెవెన్యూ అధికారులు
- సేకరించగా మిగిలిన భూమిని 22 (ఏ)లోనే కొనసాగింపు
- కుటుంబ అవసరాలకు అమ్ముకోలేని దుస్థితి
- పట్టించుకోని అధికారులు



రెవెన్యూ అధికారులు 22 (ఏ) జాబితాలో చేర్చిన జిరాయితీ భూమి

అచ్యుతాపురం, ఆగస్టు 28:

ప్రభుత్వ రంగ సంస్థ అయిన బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్(బార్క్)కు రహదారి కోసం భూములు ఇచ్చిన రైతులు.. రెవెన్యూ అధికారుల తీరుతో రెండు దశాబ్దాల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బార్క్‌కు రోడ్డు కోసం కొంత భూమిని సేకరించిన అధికారులు, అవే సర్వే నంబర్లలో మిగిలివున్న భూములను 22(ఏ) జాబితాలో చేర్చారు. దీంతో కుటుంబ ఆర్థిక అవసరాల కోసం భూములను అమ్ముకోలేకపోతున్నామని పలువురు రైతులు వాపోతున్నారు. మరోవైపు బార్క్‌కు రహదారి కోసం భూ సేకరణ సమయంలో అధికారులు ప్రకటించిన ప్యాకేజీని ఇంతవరకు అమలు చేయలేదు. అటు భూములు అమ్ముకోలేక, ఇటు ప్యాకేజీ పరిహారం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే...

అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్‌ఈజడ్)ను అనుకొని బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్(బార్క్)కు సుమారు రెండు దశాబ్దాల క్రితం దాదాపు 2,200 ఎకరాలను కేటాయించారు. ఈ భూముల్లోకి వెళ్లడానికి రహదారి కోసం దొప్పెర్ల పంచాయతీ పరిధిలో వివిధ సర్వే నంబర్లలో సుమారు 90 ఎకరాల జిరాయితీ/ డి.పట్టా భూములను 2006వ సంవత్సరంలో ఏపీఐఐసీ అధికారులు సేకరించారు. సెంటు భూమికి రూ.5,500 చొప్పున నష్ట పరిహారం, పునరావాసం కింద ఐదు సెంట్ల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.1.25 లక్షల ఆర్థిక సాయం, కుటుంబంలో వివాహం కాని మేజర్లకు కూడా ఇంటి స్థలం ఇస్తామని అధికారులు చెప్పారు. దీంతో పలువురు రైతులు తమ భూములను ఇచ్చారు. తరువాత వీరికి నష్ట పరిహారం మాత్రమే అందింది. ప్యాకేజీ (ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం) ఇప్పటికీ ఇవ్వలేదు. ఇదిలా ఉండగా ఆయా సర్వే నంబర్లలో బార్క్‌కి ఇవ్వగా మిగిలిన భూమిని రెవెన్యూ అధికారులు 22 (ఏ)లో చేర్చడంతో క్రయవిక్రయాలకు వీలులేకుండా పోయింది.

అధికారుల అనాలోచిత చర్యలు.. రైతుల అగచాట్లు

రెవెన్యూ అధికారులు చేసిన తప్పులకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిశ్రమల ఏర్పాటు, రహదారుల నిర్మాణం, ఇతర ప్రజోపకర అవసరాల నిమిత్తం భూసేకరణ చేయాలనుకుంటే ఆయా ప్రాంతాల్లో ఎంపిక చేసిన భూములను ప్రభుత్వం 22 (ఏ)లో చేరుస్తుంది. ఈ మేరకు అధికారికంగా ప్రకటిస్తుంది. అప్పటి నుంచి ఈ భూములకు రిజిస్ట్రేషన్లు జరగవు. క్రయవిక్రయాలకు ... మిగతా 8వ పేజీలో

తొమ్మిది మంది ఎస్‌ఐలకు స్థానచలనం

- ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ దీపిక

అనకాపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొమ్మిది మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ ఎం.దీపిక ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణాదేవిపేట ఎస్‌ఐగా పని చేస్తున్న ఎం.ఉపేంద్రను ఎలమంచిలి రూరల్ పోలీసు స్టేషన్‌కు, అనకాపల్లి స్పెషల్ బ్రాంచ్‌లో పని చేస్తున్న కె.సావిత్రిని ఎలమంచిలి పట్టణ పోలీసు స్టేషన్‌కు, పరవాడ ఎస్‌ఐ టి.మల్లీశ్వరరావును దేవరాపల్లికి, సబ్బవరం ఎస్‌ఐ ఆర్.ధనుంజయను కె.కోటపాడుకు, చీడికాడ ఎస్‌ఐ జి.నారాయణరావును వి.మాడుగులకు, పాయకరావుపేట ఎస్‌ఐ పి.జోగారావును చోడవరం పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. అనకాపల్లిలో పనిచేస్తున్న ఎస్‌ఐ పి.రామారావును గొలగొండకు, నర్సీపట్నం రూరల్ ఎస్‌ఐగా పని చేస్తున్న సిహెచ్.భీమరాజును నాతవరానికి, వి.మాడుగుల ఎస్‌ఐగా పని చేస్తున్న పి.దామోదరనాయుడును మాకవరపాలెం పీఎస్‌కు బదిలీ చేశారు.

బూడిద భూతం!

పవర్ ప్లాంట్ల పై యాష్‌తో ప్రజల ఇబ్బందులు

- ఎన్టీపీసీ, హిందూజాల నుంచి లారీల్లో బూడిద రవాణా
- పరిమితికి మించి లోడింగ్... కుదుపులతో కింద పడుతున్న బూడిద
- గాలికి లేచిపోయి వాహనదారులు, నివాసగృహాల ప్రజల అగచాట్లు
- కళ్ల మంటలు, శ్వాసకోశ సమస్యతో ఇబ్బందులు
- పట్టించుకోని నియంత్రణ శాఖల అధికారులు

పరవాడ, ఆగస్టు 28: సింహాద్రి ఎన్టీపీసీ, హిందూజా పవర్ ప్లాంట్‌ల నుంచి ఫ్లైయాష్ (బూడిద)ను లారీల్లో ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్న సమయంలో బూడిద జారిపోయి రోడ్డుపై పడుతున్నది. గాలి వీచినప్పుడు బూడిద ఎగిరి, ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే పాదచారులు, ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణించే వారి కళ్లల్లో పడుతున్నది. ముక్కు, నోటిఇ ద్వారా ఊపిరితిత్తుల్లోకి చేరుతున్నది. దీంతో కళ్ల మంటలు, శ్వాసకోశ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఫార్మాసిటీ రాంకీ కమర్షియల్ హబ్, లంకెలపాలెం ఏలేరు కాలువ, ఎస్‌ఈజడ్ కూడలి, దేశపాత్రునిపాలెం రైల్వే బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో ఫ్లైయాష్ (బూడిద) సమస్య చాలా తీవ్రంగా వుంది. లారీల్లో పరిమితికి మించి బూడిదను రవాణా చేయడం, పైన టార్పాలిన్లను కప్పకపోవడంతో రాకపోకల సమయంలో బూడిద కింద పడుతున్నది. ముఖ్యంగా రహదారిపై భారీ గోతులు వున్నచోట లారీలు కుదుపునకు గురై, పెద్ద



రాంకీ కమర్షియల్ హబ్, ఏలేరు కాలువ మధ్య లారీల్లో నుంచి ఎగిసిపడుతున్న బూడిద

ఎత్తున బూడిద రోడ్డుపై పడుతున్నది. మరికొంత బూడిద గాలికి లేచిపోయి, లారీలకు వెనుక, ఎదురుగా వచ్చే ద్విచక్ర వాహదారుల కళ్లల్లో పడుతున్నది. ఇంకా రహదారి పక్కనున్న దుకాణాలు, నివాస గృహాల్లోకి బూడిద చొచ్చుకు వస్తున్నది. బూడిద రవాణా చేసే లారీల కారణంగా నిత్యం కాలుష్యబారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రవాణా శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా ఫ్లైయాష్‌ను రవాణా చేస్తూ, తమ ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నారని ఆయా ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు.



లంకెలపాలెం రైల్వే ఫ్లై ఓవర్ వంతెన సమీపంలో రోడ్డుపై పేరుకుపోయిన ఫ్లై యాష్

క్రైం... crime news

హత్య కేసులో నిందితుడి అరెస్టు

మాకవరపాలెం, ఆగస్టు 28 : మండలంలోని తాడపాల లో జరిగిన హత్య కేసులో నిందుడు గనిశెట్టి దొరబాబును అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. తాడపాలలో రెండు కుటుంబాల మధ్య జరిగిన భూతగాదాలో నగిశెట్టి జోగినాయుడు, చిన్న, భాస్కరరావుతో దొరబాబుల మధ్య సోమవారం అర్ధరాత్రి జరిగిన గొడవలో జోగినాయుడు మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు నిందితుడు దొరబాబును అరెస్టు చేశారు.

చోరీకి పాల్పడిన వ్యక్తికి జైలు, జరిమానా

పరవాడ, ఆగస్టు 28: జిల్లాలోని పలు ప్రాంతాల్లో పగటి పూట ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడిన వ్యక్తికి ఎనిమిది నెలలు జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్టు పరవాడ సీఐ బాలసూర్యారావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పిళ్లా నూకరాజు పరవాడ మండల పరిధిలోని మంత్రిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో దొంగతనానికి పాల్పడ్డాడు. అప్పటి సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు, క్రైమ్ టీమ్ ఏఎస్ఐ నాయుడు, కానిస్టేబుళ్లు నాయుడు, నాగేంద్ర మాటు వేసి ఈ ఏడాది ఏప్రిల్ ఒకటిన నిందితుడు నూకరాజును పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయమై బుధవారం అనకాపల్లి కోర్టులో హాజరుపరచగా నిందితుడు నేరం చేసినట్టు రుజువు కావడంతో అనకాపల్లి 11వ అదనపు తరగతి మేజిస్ట్రేట్ ఎ.రమేష్ పై విధంగా తీర్పు వెల్లడించినట్టు సీఐ తెలిపారు.

అంతర్ జిల్లాల దొంగ అరెస్టు

» ఒంటరి మహిళలే టార్గెట్


నిందితుడు లక్ష్మణనాయుడు

గాజువాక (విశాఖపట్నం), ఆగస్టు 28: ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసుకుని వారిని మాయ మాటలతో నమ్మించి మత్తు మందు ఇచ్చి నగదు, బంగారు ఆభరణాలను కాజేస్తున్న కొట్టిన లక్ష్మణనాయుడు అనే అంతర్ జిల్లాల దొంగను విశాఖలోని గాజువాక పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 24న వడ్లపూడి ప్రధాన మార్గంలో కూరగాయలు విక్రయించే ఓ మహిళ వద్దకు లక్ష్మణనాయుడు వచ్చి మాటలు కలిపాడు. అనంతరం అక్కడ ఉన్న షాపు నుంచి చెరకు రసం తెచ్చి ఆమెకు ఇచ్చాడు. అది తాగాక ఆమె ఇంటికి వెళ్లి అపస్మారక స్థితికి వెళ్లిపోయింది. ఆ మర్నాడు ఉదయం లేచి చూసేసరికి ఆమె మెడలో ఉండాల్సిన బంగారు గొలుసు, ఇతర ఆభరణాలు, బీరువాలోని బంగారు వస్తువులు, నగదు, ఏటీఎం కార్డు కనిపించలేదు. దీంతో తమ ఇంట్లో రాత్రి దొంగతనం జరిగిందంటూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇటువంటి నేరాలు ఇటీవల నగరంలో అధికమవుతున్నట్టు గుర్తించిన పోలీస్ ఉన్నతాధికారులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. క్రైమ్ డీసీపీ సీహెచ్ శ్యామలరావు, సౌత్ డివిజన్ క్రైమ్ సీఐ కె.శ్రీనివాసరావులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేశారు. కూరగాయల దుకాణం వద్దకు వ్యక్తి గురించి ఆరా తీశారు. సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడు శ్రీకాకుళం జిల్లా పాలకొండ సమీపంలోని బాసుర ప్రాంతానికి చెందిన కొట్టిన లక్ష్మణనాయుడుగా గుర్తించారు. ఈ క్రమంలో లక్ష్మణనాయుడు మంగళవారం ఇక్కడి రాజీవ్‌నగర్ బ్రిడ్జి వద్ద ఉన్నట్టు పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుని వద్ద నుంచి బంగారు చైను, మూడు తులాల ఇతర ఆభరణాలు, కొన్ని ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఇప్పటికే నిందితుడిపై గాజువాక, పెందుర్తి, విశాఖ టూ టౌన్, విజయనగరం, కాకినాడ జిల్లా సామర్లకోట, అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట, శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నాయి.

ఆ మృతదేహం వేటజంగాలపాలెం మహిళది

కొత్తూరు, ఆగస్టు 28 : అనకాపల్లి పట్టణానికి ఆనుకుని ఉన్న శారదా నదిలో మంగళవారం లభ్యమైన మృతదేహం వివరాలు గుర్తించినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. అనకాపల్లి మండలం వేటజంగాలపాలెం పంచాయతీ క్వారీ కాలనీకి చెందిన మడక పైడమ్మ (75)గా గుర్తించామన్నారు. ఈమె మృతికి గల పూర్తి కారణాలు విచారణలో తేలాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

» విద్యార్థులకు తప్పిన ముప్పు



నక్కపల్లి, ఆగస్టు 28 : మండలంలోని రాజయ్యపేట సమీపం హెటెరో పరిశ్రమకు ఆనుకుని ఉన్న రహదారిపై బుధవారం సాయంత్రం కళాశాల విద్యార్థులతో వెళుతున్న ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. నక్కపల్లి నుంచి బుచ్చిరాజుపేట, రాజయ్యపేట గ్రామాలకు కొందరు విద్యార్థులు ఆటోలో వెళ్తుండగా, మార్గ మధ్యలో ఉన్న మలుపు వద్ద ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, ముగ్గురు విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 28 : పట్టణంలోని చినరాజుపేటకు చెందిన వృద్ధురాలు అదృశ్యమైనట్టు బుధవారం ఫిర్యాదు అందిందని ఎస్ఐ మహ్మద్ అలీ తెలిపారు. అలంక నూకరత్నం అనే వృద్ధురాలు ఆరోగ్యం బాగోలేక పోవడంతో మందులు వాడడం లేదని కొడుకు మంగళవారం ఉదయం కోపగించుకున్నాడన్నారు. దీనికి మనస్తాపం చెందిన ఆమె ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయినట్టు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఈ మేరకు ఆమె కుమారుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

కిరండోల్ రైళ్లు దంతెవాడ వరకే...

విశాఖపట్నం, ఆగస్టు 28: బచేలి, కిరండోల్ మధ్య భారీ వర్షాలు కురుస్తున్నందున విశాఖ- కిరండోల్ మధ్య నడిచే రైళ్ల గమ్యాలను విశాఖ, దంతెవాడ మధ్య కుదించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నేపథ్యంలో విశాఖ నుంచి కిరండోల్ వెళ్లే 08551 నంబరు గల పాసింజర్ రైలు, 18514 నంబరు గల నైట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 29 నుంచి వచ్చే నెల నాల్గో తేదీ వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలో 08552 నంబరు గల పాసింజర్ రైలు, 18513 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 30 నుంచి వచ్చే నెల ఐదో తేదీ వరకు దంతెవాడ నుంచి విశాఖకు నడుస్తాయని పేర్కొన్నారు. దంతెవాడ, కిరండోల్ మధ్య రాకపోకలు తాత్కాలికంగా రద్దు చేసినట్టు వివరించారు.

నాందేడ్, హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌లకు శాశ్వత అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, ఆగస్టు 28: ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ- అమృతసర్ మధ్య నడిచే హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌లకు, విశాఖ-నాందేడు మధ్య రాకపోకలు సాగించే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు శాశ్వత ప్రాతిపదికన అదనపు కోచ్‌లు జత చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సెప్టెంబరు మూడు నుంచి విశాఖ - అమృతసర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు (20807) ఒక స్లీపర్, ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లు, సెప్టెంబరు ఏడు నుంచి అమృతసర్- విశాఖ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు (20 808) ఒక స్లీపర్, ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లు అదనంగా అందుబాటులోకి వస్తాయి. ఇక సెప్టెంబరు మూడు నుంచి విశాఖ- నాందేడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు (20811) ఒక స్లీపర్, ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్, సెప్టెంబరు నాలుగు నుంచి నాందేడు - విశాఖ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు (20812) ఒక స్లీపర్, ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లు అదనంగా అందుబాటులోకి రానున్నట్టు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	91.00
లైవ్ ధర	111.00
విత్ స్కిన్	192.00
స్కిన్ లెస్	202.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

పోలీసు క్రీడా మైదానంపై నిర్లక్ష్యపు క్రీనీడ

» ఒకప్పుడు భారీ టోర్నమెంట్లు నిర్వహణ
» నేడు తుప్పలు, గోతులతో కళావిహీనం
» వర్షం వస్తే చెరువులా మారుతున్న వైనం


వర్షం వస్తే నీరు చేరి చెరువులా తయారైన దృశ్యం

మాడుగుల, ఆగస్టు 28:

ఒకప్పుడు అందుబాటులో ఉంటూ కళకళలాడిన పోలీసు క్రీడా మైదానం నేడు నిరుపయోగంగా మారిపోయింది. తుప్పలు నిండి, వర్షం కురిస్తే నీరు చేరి జలమయంగా మారింది. భారీ క్రీడా మైదానంపై నిర్లక్ష్యం క్రీనీడ పడడంతో యువత, విద్యార్థులకు ఆడుకునే అవకాశమే లేకుండా పోతోంది.

మాడుగుల మోదకొండమ్మ అమ్మ వారి ఆలయానికి వెళ్లే దారిలో భారీ విస్తీర్ణం కలిగిన పోలీస్ డ్రిల్ మైదానం తుప్పలతో నిండి ఉండేది. దీన్ని అప్పుడు ఇక్కడ ఎస్ఐగా పని చేసిన ఎస్వై తారకేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గ్రామంలోని కొందరు సీనియర్ క్రీడాకారులు, గ్రామ పెద్దల సహకారంతో క్రీడా మైదానం తీర్చిదిద్దారు. స్థానిక యువత, విద్యార్థులకు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించే ఉద్దేశంతో ఇక్కడ కొన్ని క్రీడా పరికరాలను సైతం అమర్చారు. స్థానిక విద్యార్థులకు బాల్ బ్యాడ్మింటన్ కిట్లు కొనుగోలు చేసి అందించి ఉచితంగా శిక్షణ అందించారు. ఉత్తరాంధ్ర స్థాయిలో బాల్ బ్యాడ్మింట్ పోటీలు సైతం ఈ మైదానంలో ఘనంగా నిర్వహించారు. తరచూ వివిధ క్రీడా పోటీలు నిర్వహించేవారు. ఇక్కడ పలువురు క్రీడల్లో గెలుపొంది ఉన్నతాధికారు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.


మైదానంలో ఆటలు ఆడుతున్న బాలబాలికలు (ఫైల్)

అయితే ఎస్వై తారకేశ్వరరావు బదిలీ కావడంతో క్రీడా నిర్వహణ బాధ్యతను చూసే వారే కరువయ్యారు. దీంతో క్రమేపీ మైదానం కళ కోల్పోయింది. తుప్పలు పెరిగాయి. గోతులు ఏర్పడడంతో వర్షం వస్తే నీరు చేరి చెరువును తలపిస్తున్నది. ప్రస్తుతం ఈ క్రీడా మైదానం పరిస్థితి దీనంగా ఉంది. పట్టించుకునే వారే లేకుండా పోయారు.

ఈ క్రీడా మైదానానికి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. ఎందరో క్రీడాకారులు ఇక్కడ నుంచి రూపొందే అవకాశం ఉంటుందని పలువురు అంటున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ క్రీడా మైదానానికి అందుబాటులోకి తెచ్చి పూర్వ వైభవం వచ్చేలా కృషి చేయాలని కోరుతున్నారు.

తాండవ వంతెనపై కూలిన రక్షణ గోడ

» ఏమాత్రం ఆదమరచి ఉన్నా నదిలో పడడం ఖాయమని పలువురు ఆందోళన
» ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని వేడుకోలు


వంతెనపై రక్షణ గోడ కూలిన దృశ్యం

పాయకరావుపేట, ఆగస్టు 28: ఇక్కడి తాండవ నదిపై గల వంతెనకు ఒక వైపు ఉన్న రక్షణ గోడ ప్రమాదకరంగా మారింది. కాకినాడ, అనకాపల్లి జిల్లాల సరిహద్దుగా పాయకరావుపేట, తుని పట్టణాల మధ్య ప్రవహిస్తున్న తాండవ నదిపై ఉన్న వంతెన రెండు పట్టణాల ప్రజల రాకపోకలతో పాటు వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. 1990లో వచ్చిన తుఫాన్ కారణంగా పాయకరావుపేట, తుని పట్టణాల మధ్య తాండవ నదిపై ఉన్న బ్రిటీష్ కాలంనాటి వంతెన కూలిపోయింది. దీంతో అప్పట్లో కొత్తగా వంతెన నిర్మించారు. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఈ వంతెనకు ఇరువైపులా రక్షణగా ఐరన్ రైలింగ్ ఏర్పాటుచేశారు. అనంతర కాలంలో ఐరన్ రైలింగ్ తుప్పుపట్టి ఎక్కడికక్కడ కూలిపోతుండడంతో ఆయా ప్రదేశాల్లో ఇటుకలతో రక్షణ గోడ నిర్మించారు. ప్రస్తుతం ఇవి శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల కురిసిన వర్షానికి మంగళవారం రాత్రి సుమారు 20 మీటర్లమేర గోడ కూలిపోయింది. దీంతో వాహనదారులు ఏమాత్రం ఆదమరచి ఉన్నా సుమారు 30 అడుగుల కింద నదిలో పడిపోవడం ఖాయమని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు పట్టణాల మధ్య ఉన్న ఈ వంతెనపై నిత్యం ఆర్టీసీ, స్కూల్, వివిధ కంపెనీ బస్సులతో పాటు ఆటోలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని పలువురు హడలిపోతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తాండవ వంతెనపై రక్షణ గోడ కూలిన చోట కొత్తగా గోడ నిర్మించాలని అంతా కోరుతున్నారు.

'అనకాపల్లి' టైటిల్‌తో కొత్త చిత్రం

» వెంకటేశ్వర థియేటర్‌లో హీరో, హీరోయిన్లపై పలు సన్నివేశాలు చిత్రీకరణ


హీరో విక్రమ్, కథకుడు నక్కినను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

అనకాపల్లి టౌన్, ఆగస్టు 28: పట్టణంలో బుధవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. ఇక్కడి స్టేషన్ రోడ్డులోని వెంకటేశ్వర థియేటర్‌లో నక్కిన నేరేటివ్స్ ప్రొడక్షన్‌లో 'అనకాపల్లి' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఖగేష్ తమ్మినేని దర్శకత్వంలో విక్రమ్, సంధ్య హీరో హీరోయిన్లుగా, తారక్ పొన్నప్ప (కేజీఎఫ్ విలన్) తారాగణంతో ప్రేమకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ తెరకెక్కించారు. ఇటు ప్రముఖ హీరో మహేష్‌బాబు నటించిన బిజినెస్‌మెన్ సినిమా విడుదల రోజున అభిమానుల కోలాహలం, అటు హీరో హీరోయిన్లు కలయిక వంటి సన్నివేశాలు చిత్రీకరణ వెరసి కోలాహల వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా చిత్ర నిర్వాహకులు మాట్లాడుతూ అనకాపల్లి అనే టైటిల్ నేపథ్యంలో ప్రేమకథా చిత్రాన్ని ప్రేక్షకులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే నక్కిన త్రినాథరావు, సంగీతం దేవ్‌జాండ్, ఎడిటింగ్ ప్రవీణ్ పూడి, కెమెరా వంశీలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర షూటింగ్ జరుగుతున్న వెంకటేశ్వర థియేటర్‌ను సందర్శించారు. అనంతరం పీలా మాట్లాడుతూ సినిమా టైటిల్ అనకాపల్లి అని పెట్టడం సంతోషం కలిగించిందన్నారు. ఈ చిత్రాన్ని ఇక్కడ చిత్రీకరిస్తున్నందుకు, అలాగే, అనకాపల్లిలో ఉన్న కళాకారులకు అవకాశం ఇస్తున్నందుకు చిత్ర బృందాన్ని అభినందించారు. హీరో విక్రమ్, కథకుడు నక్కిన త్రినాథరావులను సత్కరించారు.

అనాథాశ్రమాల్లో అధికారుల బృందం తనిఖీలు


తామరంలోని అనాథాశ్రమంలో తనిఖీ చేస్తున్న అధికారులు

మాకవరపాలెం, ఆగస్టు 28: ఇమ్మాన్యుయేలు సంస్థ నిర్వహిస్తున్న కొండలఅగ్రహారం, తామరం గ్రామాల్లో ఉన్న అనాథ ఆశ్రమాలను అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. ఇటీవల కోటవురట్లలో అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు చిన్నారులు మృతి చెందిన ఘటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ సందర్భంగా తాజాగా అనాథాశ్రమాల్లో తనిఖీలు నిర్వహించిన అధికారుల బృందం అక్కడి వంటగది, పరిశుభ్రత, పరిసరాలు, మెనూ నిర్వహణ, భోజన నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు. అయితే తనిఖీలకు వస్తున్నట్టు అధికారులు ముందుగా ఆశ్రమాల నిర్వాహకులకు సమాచారం ఇవ్వడంతో వారంతా అప్రమత్తం అయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అలాకాకుండా ఆకస్మిక తనిఖీలు చేపడితే అసలు రంగు బయట పడుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ తనిఖీ బృందంలో టీడీ శంకరరావు, ఎస్ఐ. రామకృష్ణారావు, ఎంఈవో మూర్తి తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల, ఆగస్టు 28 : రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 90 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లో అనకాపల్లి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణతో కలిసి బుధవారం ఆమె పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఒక కళాశాల నుంచి ఎంతమంది విద్యార్థులైనా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకుని క్విజ్ పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. సెప్టెంబరు 17వ తేదీలోపు విద్యార్థులు తమ దరఖాస్తులో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. స్టేట్ రౌండ్‌కు ప్రథమ బహుమతిగా రెండు లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.లక్షా 50వేలు, తృతీయ బహుమతిగా రూ.లక్ష అందించనున్నారని వివరించారు. అలాగే జోనల్ రౌండ్‌కు మొదటి బహుమతిగా రూ.ఐదు లక్షలు, రెండవ బహుమతిగా రూ.నాలుగు లక్షలు, మూడవ బహుమతిగా రూ.మూడు లక్షలు ఉంటుందన్నారు. నేషనల్ ఫైనల్ రౌండ్‌లో మొదటి బహుమతిగా రూ.10 లక్షలు, రెండవ బహుమతిగా ఎనిమిది లక్షలు, మూడో బహుమతిగా ఆరు లక్షలు అందించనున్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని డిగ్రీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

నెల్లిపూడి సర్పంచ్‌పై కేసు

నక్కపల్లి, ఆగస్టు 28 : మండలంలోని నెల్లిపూడి గ్రామ సర్పంచ్ కె.సురేష్‌పై కేసు నమోదు చేసినట్టు నక్కపల్లి ఎస్ఐ సన్నిబాబు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన గూడుపు అప్పారావు అనే వ్యక్తి తనను తరచూ దూషిస్తున్నాడనే నెపంతో సర్పంచ్ కె.సురేశ్ మంగళవారం రాత్రి అప్పారావును నిలదీసి, వాటర్ బాటిల్‌తో కొట్టినట్టు బాధితుడు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు సర్పంచ్‌పై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

బాధిత కుటుంబానికి జన సైనికుల ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న జనసైనికులు

దేవరాపల్లి, ఆగస్టు 28 : మండలంలోని మారేపల్లిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన అల్లు అప్పారావు కుటుంబానికి జనసైనికులు రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాయపురెడ్డి కృష్ణ, మండల అధ్యక్షుడు గొర్రుపోటు రామ్మూర్తినాయుడు సమకూర్చిన రూ.ఇరవై వేలు నగదును మారేపల్లి గ్రామ జనసేన వీర మహిళ సత్యవేణి, అందజేశారు. అంజిబాబు, ప్రసాదు, మోహన్, రామారావు, మోహన్, ఈర్లె.రాము, చిన్నమ్మలు, మంగ, కృష్ణ పాల్గొన్నారు.

నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో బాలాజీ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 28: జిల్లాలో నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్టు అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ జీవీ రమణకుమార్ తెలిపారు. ఇక్కడి డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుధవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను డీఎంహెచ్‌వో బాలాజీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణకుమార్ మాట్లాడుతూ ఈనెల 25 నుంచి సెప్టెంబరు ఎనిమిదో తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని జరుపుతామన్నారు. జిల్లావ్యాప్తంగా కరపత్రాలు పంపిణీ చేయడం, నేత్రదాన ప్రమాణ పత్రాలు సేకరిస్తుండడం వంటివి చేస్తున్నట్టు చెప్పారు. పీహెచ్‌సీల్లో, ఉన్నత పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. 2022-23 సంవత్సరంలో 51మంది, 2023-24లో 60 మంది, 2024-25 ఆగస్టు వరకు 58 మంది నేత్ర దానం చేశారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక లారీలు, జేసీబీ స్వాధీనం


పోలీసులు పట్టుకున్న ఇసుక తరలిస్తున్న లారీలు

నక్కపల్లి, ఆగస్టు 28 : మండలంలోని డీఎల్‌పురం నుంచి అక్రమంగా సముద్రపు ఇసుకను తరలిస్తుండగా పోలీసులు బుధవారం పట్టుకున్నారు. మండలంలోని కారిడార్ భూముల్లోని డీఎల్‌పురం తీర ప్రాంతంలో సముద్రపు ఇసుకను అక్రమంగా తవ్వి తరలిస్తున్నారంటూ మంగళవారం 'ఇసుక తోడేళ్లు'శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై అధికారులు స్పందించారు. ఎస్ఐ సన్నిబాబు తన సిబ్బందితో కలిసి డీఎల్‌పురం పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఇసుకను తరలిస్తున్న రెండు లారీలు, ఒక జేసీబీని పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించారు. ఆయా యజమానులకు తహసీల్దార్ జరిమానా విధించినట్టు సీఐ కుమారస్వామి తెలిపారు. సముద్రపు ఇసుకను ఎవరైనా అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

'సింహాద్రి' రెండో యూనిట్‌లో ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, ఆగస్టు 28: సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ) లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో ఉత్పత్తిని మంగళవారం అర్ధరాత్రి పునరుద్ధరించారు. ఈ యూనిట్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఆదివారం ఉదయం ఉత్పత్తి అర్ధంతరంగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించారు. ప్రస్తుతం ప్లాంట్‌లో అన్ని యూనిట్ల్లో ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతుందని అధికారులు వివరించారు.

ఆశ్రమ పాఠశాలల గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం కార్యవర్గం

మాడుగుల రూరల్, ఆగస్టు 28 : అనకాపల్లి జిల్లా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఎన్నికలు ఇటీవల జరిగినట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బావరాజు తెలిపారు. కోనాం ఆశ్రమపాఠశాల హెచ్ఎం యూవీ రమణమూర్తి జిల్లా అధ్యక్షులుగా, తాటిపర్తి ఆశ్రమపాఠశాల హెచ్ఎం ఎస్ఎస్ రమాదేవి జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు : పరమేశ్వరరావు


పార్టీ నేతలతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

ఎలమంచిలి, ఆగస్టు 28 : వచ్చే నెల రెండో తేదీన ప్రారంభం కానున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇక్కడి ప్రాంతీయ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలో బుధవారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ప్రతి బూత్‌స్థాయి నుంచి పార్టీ సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. ఇందుకోసం కమిటీ ప్రతినిధులుగా పప్పు ఈశ్వరరావు, రామకృష్ణరాజు, పిట్టా దాసుబాబులను నియమించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జీవీఎస్ వర్మ, రాజాన సత్యనారాయణ, గుర్రాల నగేష్, నక్కా శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

30న గెస్ట్ లెక్చరర్ల భర్తీకి ఇంటర్వ్యూలు

దేవరాపల్లి, ఆగస్టు 28 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టు నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రాధ తెలిపారు. బుధవారం ఇంటర్వ్యూకు అభ్యర్థులెవరూ రాకపోవడంతో ఈ నెల 30న మళ్లీ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్టు ఆమె చెప్పారు. జువాలజీ, కంప్యూటర్ సైన్సు కోర్సులకు సంబంధించి నియామకాలు చేపడుతున్నట్టు చెప్పారు. అభ్యర్థులు సంబంధిత అంశంలో 50 శాతం మార్కులతో పీజీ చేసి ఉండాలన్నారు. ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

3 నెలల్లో విశాఖ ఉక్కును ట్రాక్‌లో పెడతా

» వర్కింగ్ కేపిటల్ రూ.7,500 కోట్లు అవసరం : సీఎండీ అతుల్ భట్

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని రాబోయే మూడు నెలల్లో ట్రాక్‌లో పెడతానని సీఎండీ అతుల్ భట్ హామీ ఇచ్చారు. ప్లాంటులో కార్మిక సంఘాలతో బుధవారం సుమారు మూడు గంటలసేపు సమావేశం నిర్వహించి తాజా పరిస్థితిపై చర్చించారు. తన పదవీ కాలం ఇంకా మూడు నెలలే ఉందని, ఈలోగా సమస్యలన్నీ పరిష్కరిస్తానన్నారు. ప్లాంటును 100 శాతం సామర్థ్యంతో నడిపించాలంటే రూ.7,500 కోట్లు వర్కింగ్ కేపిటల్ (నిర్వహణ మూలధనం) అవసరమని, దానిని సమకూర్చుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇది కష్టకాలమని, కార్మిక సంఘాలు, అధికారులు యాజమాన్యంతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉత్పత్తి తగ్గడంలో ఎవరి తప్పు లేదని, ముడి పదార్థాల కొరతే కారణమన్నారు. గురువారం నుంచి ప్రతి రోజు ఐదు ర్యాక్‌లతో ఐరన్ ఓర్ పంపించడానికి ఎన్ఎండీసీ అంగీకరించిందన్నారు. ఎక్కువ ఉత్పత్తి చేస్తే తప్ప ఉత్పత్తి వ్యయం తగ్గదన్నారు. గంగవరం పోర్టులో అటాచ్‌మెంట్‌లో ఉన్న కోకింగ్ కోల్‌ను రెండు, మూడు రోజుల్లో విడిపిస్తామన్నారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ



ప్రధాన రోడ్డుపై ర్యాలీ నిర్వహిస్తున్న సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు

ఎలమంచిలి, ఆగస్టు 28 : మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడ పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐల ప్రతినిధులు, విద్యార్థులు కలిసి తులసీ చిత్రమందిర్ జంక్షన్‌లో 'మత్తుకు బానిసలు కావద్దు.. జీవితం నాశనం చేసుకోవద్దు..యువత మేలుకో అంటూ.. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ప్రధాన రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. రమణ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.శివాజీ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనమే అన్నారు. యువకులు, పెద్దలు వీటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ ప్రతినిధులు ముడియం చిన్ని, వి.శివకుమార్‌తో పాటు పలువురు ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

2న రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల తదితరులు

సబ్బవరం, ఆగస్టు 28 : జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని వచ్చే నెల రెండో తేదీన జీవీఎంసీ 88వ వార్డు వెదుళ్లనరవలో నిర్వహించనున్న రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలను అంతా సద్వినియోగం చేయాలని పరవాడ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి పోస్టర్‌ను గ్రామంలోని పార్టీ నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. రక్తదానం చేయడం ఎంతో గొప్ప అవకాశంగా పేర్కొన్నారు. ఇందుకోసం అంతా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు వబ్బిన జనార్దన శ్రీకాంత్, మోటూరి నూకరాజు, చిన్నారావు, అశోక్, చలం, గవర శ్రీను, నరేష్, శ్రీను, ప్రవీణ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులతో 'రెవెన్యూ' చెలగాటం

... 5వ పేజీ తరువాయి

వీలులేదు. అయితే దొప్పెర్ల పంచాయతీ పరిధిలో రెవెన్యూ అధికారుల అనాలోచిత చర్యల కారణంగా 50 మందికిపైగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బార్క్‌కు రహదారి నిమిత్తం పలు సర్వే నంబర్లలో 90 ఎకరాల వరకు సేకరించగా, అవే సర్వే నంబర్లలో మిగిలిన భూమిని కూడా 22 (ఏ) జాబితాలోనే వుంచేశారు. ఉదాహరణకు కొల్లి పైడిరాజు కుటుంబ సభ్యులకు సర్వే నంబర్లు 28, 32, 34, 103లలో 9 ఎకరాల 13 సెంట్ల భూమి వుంది. బార్క్‌కి రోడ్డు కోసం మూడు ఎకరాల 9 సెంట్లు సేకరించారు. నష్ట పరిహారం కూడా ఇచ్చేశారు. అయితే ఈ సర్వే నంబర్లలో మిగిలిన ఆరు ఎకరాలను కూడా 22 (ఏ)లో చేర్చారు. దీంతో బార్క్‌కి ఇవ్వగా మిగిలిన భూమిని అమ్ముకోవడానికి వీలులేకపోయిందని పైడిరాజు కుటుంబ సభ్యులు వాపోతున్నారు. కొరుప్రోలు సన్నిబాబు కుటుంబానికి వివిధ సర్వే నంబర్లలో ఎకరా 45 సెంట్ల భూమి వుంది. బార్క్ రోడ్డు కోసం వీరి భూమిని తీసుకోలేదు. కానీ ఇదే సర్వే నంబరులో ఉన్న వేరొక రైతు భూమిని తీసుకున్నారు. కానీ సర్వే నంబర్ అంతటినీ అధికారులు 22 (ఏ)లో చేర్చేశారు. దీంతో భూమిని అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడింది. కొల్లి వరహాలరావుకి 4.27 ఎకరాల భూముంది. ఇందులో 27 సెంట్లు మాత్రమే బార్క్ రోడ్డు కోసం సేకరించారు. కాని సర్వే నంబర్‌లో వున్న మొత్తం భూమిని 22 (ఏ)లో చేర్చారు. ఈ విధంగా సుమారు 50 మంది రైతులకు చెందిన వంద ఎకరాల భూములు 22 (ఏ)లో చేరడంతో క్రయవిక్రయాలు జరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సబ్‌డివిజన్ చేస్తే సమస్య పరిష్కారం

బార్క్‌కు రహదారి కోసం సేకరించిన వివిధ సర్వే నంబర్లలోని భూములను ఆనాడే సబ్‌డివిజన్ చేస్తే సమస్య పరిష్కారం అయ్యేదని అధికారులు అంటున్నారు. బార్క్ కోసం ఏపీఐఐసీ అధికారులు సేకరించిన భూములను సబ్‌డివిజన్ చేయకుండా సర్వే నంబర్లను రిజిస్ట్రేషన్ శాఖకు ఇవ్వడం వల్ల వీటిని ప్రభుత్వ భూములుగా పేర్కొంటూ 22 (ఏ) జాబితాలో నమోదు చేశారు. సబ్ డివిజన్ చేయాలని 18 సంవత్సరాల నుంచి ఏపీఐఐసీతో పాటు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆయా రైతులు ఆరోపిస్తున్నారు.

మనవడి ఉన్నత విద్యకు పొలం అమ్ముకోలేని పరిస్థితి



నాకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె కొడుకు బీటెక్ పూర్తిచేశాడు. యూకేలో ఎంఎస్ చేయాలనుకుంటున్నాడు. ఇందుకు రూ.30 లక్షలు అవసరం అవుతాయి. దొప్పెర్లలో సెంటు భూమి ప్రస్తుతం రూ.2 లక్షలు పలుకుతోంది. మాకున్న భూమిలో కొంత అమ్మి చదివిద్దామంటే 22(ఏ)లో చేర్చడం వల్ల కుదరడం లేదు. ప్రైవేటు వ్యక్తులకు తనఖా పెడదామంటే ఎవరూ ముందుకు రావడంలేదు.

- కొల్లి పైడిరాజు, దొప్పెర్ల

ప్రభుత్వమే న్యాయం చేయాలి



నా తల్లిదండ్రులు వృద్ధాప్యంతోపాటు అనారోగ్యంతో బాధపడుతున్నారు. తమ్ముడు గతంలోనే చనిపోయాడు. చెల్లెలు దివ్యాంగురాలు. మాకు ఈ భూమే ఆధారం. కొంత భూమిలో జీడిమామిడి తోట వుంది. మిగతా భూమి ఖాళీగా ఉంది. నాన్నకు, చెల్లికి వచ్చే పెన్షనే మాకు జీవనాధారం. ఇల్లు శిథిలావస్థకు చేరింది. కొంత భూమి అమ్ముకుని ఇల్లు నిర్మించుకుందామంటే విక్రయించడానికి వీలు లేకపోయింది. ప్రభుత్వం స్పందించి మా భూములకు 22 (ఏ) నుంచి విముక్తి కల్పించాలి.

- కొరుప్రోలు అమ్మాజీ, దొప్పెర్ల

టిడ్కో గృహాల్లో సమస్యలపై ఆందోళన

- ఐదేళ్ల వైసీపీ పాలనలో పార్టీ రంగులు వేయడానికే పరిమితమయ్యారని నివాసితులు ఆరోపణ
- పరిష్కారానికి కృషి చేయాలని టీడీపీ నాయకులకు వినతి


టిడ్కో గృహాల్లో సమస్యలపై ఆందోళన చేస్తున్న నివాసితులు

కొత్తూరు, ఆగస్టు 28 : అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ మెగా లేఅవుట్‌లో ఉన్న టిడ్కో గృహ సముదాయాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానికులు బుధవారం ఆందోళన చేపట్టారు. వారంతా ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి నేతలకు వివరించారు. ప్రధానంగా పై అంతస్తుల్లో ఉన్న వారం కొద్దిపాటి చినుకులు పడినా వర్షపు నీటితో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అలాగే ఇంట్లో నివసించడానికి ఇబ్బంది పడేవిధంగా నీళ్లు కారిపోతున్నాయని వాపోయారు. కాలనీలో తుప్పలు పెరిగిపోవడం వల్ల విష సర్పాల భయం వెంటాడుతోందన్నారు. అదే విధంగా వీధి దీపాలు వెలగడం లేదని, కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందని, కేబీ రహదారికి పక్కా రోడ్డు నిర్మించాలని కోరారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కేవలం పార్టీ రంగులు మాత్రమే వేసి విడిచి పెట్టిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వ హణను పట్టించుకోక పోవడంతో కొన్ని భవనాలు శిథిలమయ్యాయన్నారు. మరికొన్ని పూర్తిగా చెదలు పట్టాయని పేర్కొన్నారు. దీనిపై టీడీపీ మండల నాయకుడు పొలమరశెట్టి నూకరాజు మాట్లాడుతూ కాలనీ ఏర్పాటు, నిర్మాణాలకు అప్పటి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ విశేష కృషి చేశారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కాలనీకి ఆహ్వానించి, సమస్యలు ఆయన దృష్టికి తీసుకు వెళ్లేలా తనవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు వాయిబోయిన ఇన్నమ్మలు, శ్రీలక్ష్మి, సౌజ్య, కర్రి లక్ష్మి, చింతల పార్వతి, పెంటకోట బంగారమ్మ, ధనలక్ష్మి, లక్ష్మి, కాండ్రేగుల జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో కృష్ణాష్టమి వేడుకలు



యశోధగా దర్శనమిస్తున్న అమ్మవారు.., ఆలయ సంప్రదాయం ప్రకారం ఉట్ల సంబరం

నక్కపల్లి, ఆగస్టు 28: ఉపమాక వెంకన్న సన్నిధిలో కృష్ణాష్టమి వేడుకలను ఆలయ ఆచార, వ్యవహారాలను అనుసరించి బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో గోదాదేవి అమ్మవారిని యశోధగా అలంకరించారు. ఆమె ఒడిలో చిన్ని కృష్ణుడికి పాలు పెడుతున్నట్టు అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం రాత్రి ఆలయ ప్రాంగణంలో ఆలయ సంప్రదాయాల మేరకు ఉట్ల సంబరాన్ని నేత్రపర్వంగా జరిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉట్ల సంబరంలో అనేక మంది భక్తులు పాల్గొన్నారు.

'దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి'


ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న దివ్యాంగులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 28 : ఇక్కడి ఉడ్‌పేటలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి జిల్లా కార్యదర్శి పాత్రపల్లి వీరయాదవ్ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ రెండు తెలుగు రాష్ట్రాల్లో దివ్యాంగులకు ఎంతో మేలు చేశారని కొనియాడారు. పింఛన్ పెంపునకు ఆయనే కారణమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, తీవ్ర అన్యాయం చేసిందని వాపోయారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కె.కోటేశ్వరరావు, ఆడారి తులసీ, అప్పికొండ శివ, ఎం.గణేష్, దిలీప్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


ప్రగడ నాగేశ్వరరావుతో ఎన్నికైన సభ్యులు

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 28 : సెజ్ కేంద్రంగా నడుస్తున్న కనకదుర్గ లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా అడిగర్ల దేవుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా ప్రగడ కొండలరావు, కోశాధికారిగా ప్రగడ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా లాలం చినసత్యంలను ఎన్నుకున్నారు. వీరంతా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్యదర్శి ప్రగడ ప్రకాష్, కోశాధికారి నర్మాల రమణ పాల్గొన్నారు.

మళ్లీ గోకులాలు!

... 5వ పేజీ తరువాయి

పనులు జరిగిన 788 మినీ గోకులాల పనుల పూర్తికి అనుమతించారు. కాగా 25 శాతం కంటే తక్కువ పనులు అయిన వాటిని పూర్తిచేసేందుకు ఏడాది తరువాత ప్రభుత్వం అనుమతించింది. అయితే బిల్లులు వస్తాయో.. రావోనన్న అనుమానంతో 421 మంది రైతులు ఈ పథకం నుంచి వైదొలిగారు. మిగిలిన 1,683 మంది పనులు చేపట్టారు. నెలలు గడిచినా బిల్లులు రాలేదు. పలువురు రైతులు స్పందనలో అర్జీలు అందజేశారు. ఎట్టకేలకు స్పందించిన అప్పటి ప్రభుత్వం అరకొరగా నిధులు విడుదల చేసింది. కనీసం నాలుగో వంతు మంది లబ్ధిదారులకు కూడా నిధులు అందలేదు. పైగా 'పాన్' కార్డు వుంటేనే బిల్లులు మంజూరు చేస్తామని నిబంధన విధించడంతో కొద్ది మందికి మాత్రమే రాయితీ సొమ్ము అందింది.

పథకం పునరుద్ధరణ

రెండున్నర నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం... పశుపోషణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని గోకులాల పథకాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించింది. పశువులతోపాటు జీవాలు, కోళ్లకు కూడా షెడ్లు నిర్మించుకునే వెసులుబాటు కల్పించింది. గోకులాల పథకంలో పశువులకు మూడు రకాలు, గొర్రెలు/ మేకలు, కోళ్లకు రెండు రకాల షెడ్లు నిర్మించుకోవచ్చు. రెండు పశువుల కోసం నిర్మించే షెడ్డు విలువ రూ.1,15,000, నాలుగు పశు వుల కోసం నిర్మించే షెడ్డు ఖర్చు రూ1,85,000, ఆరు పశువులకు షెడ్డు కోసం రూ.2,30,000లుగా నిర్ధారించారు. 90 శాతం సబ్సిడీ పోను 10 శాతం రైతులు భరించాల్సి ఉంటుంది. ఇక 20 గొర్రెలు/ మేకల కోసం రూ1,30,000, ఒకవేళ 50 జీవాలు ఉంటే రూ2,30,000 ఖర్చు అవుతుంది. ఇందులో రైతులు 30 శాతం ఖర్చు భరించాలి. కోళ్లకు షెడ్డు నిర్మించుకునేందుకు వంద కోళ్లకు రూ 87,000 అవుతుంది. ఇందులో రూ 28,100 రైతులు భరించాలి. 200 కోళ్లషెడ్డు విలువ రూ.1,32,000. ఇందులో రైతులు భరించాల్సిన ఖర్చు రూ39 వేలు. ఈ పథకం కింద షెడ్లు నిర్మించుకోవాలనుకునే రైతులు సమీపంలోని గ్రామ సచివాలయాల్లో పశు సంవర్థక సహాయకులను సంప్రదించి, దరఖాస్తు చేసుకోవాలి.

'నేత్రదానంతో మరొకరి జీవితంలో వెలుగు'


అవగాహన ర్యాలీని ప్రారంభిసుతన్న డాక్టర్ ఆశ

సబ్బవరం, ఆగస్టు 28 : జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రం సబ్బవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఆశ మాట్లాడుతూ నేత్రదానంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. మనిషి మరణించిన అర్ధగంటలో కళ్లు దానం చేస్తే మరో మనిషికి చూపును ప్రసాదించ వచ్చునన్నారు. నేత్రదానం అన్నిదానాల కన్నా గొప్పదిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో స్వర్ణలత, హెచ్ఈవో జేసుదాసు, ఎ.రాజీవ్‌లోచన, సిబ్బంది పాల్గొన్నారు.

'ఈ- పంట నమోదుతో రైతులకు మేలు'

పరవాడ, ఆగస్టు 28 : ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి సీహెచ్.చంద్రావతి సూచించిరు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పంటనమోదు చేసుకున్న రైతులకు మాత్రమే గిట్టుబాటు ధర, పంటల బీమా, పెట్టుబడి రాయితీ, అన్నదాత సుఖీభవ, వడ్డీ రాయితీ వంటి పథకాలు వర్తిస్తాయన్నారు. పంటలు సాగు చేసిన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి ఆయా సర్వే నంబర్ల వారీగా సాగు చేసిన పంటల వివరాలు తెలియజేయాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు పొలాల వద్దకు వెళ్లి ఫొటో తీసి వివరాలు నమోదు చేస్తారన్నారు. ఈ ప్రక్రియ వచ్చే నెల 15వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో కొనసాగుతుందన్నారు.

విద్యుత్ పోరాటంలో అమరవీరులకు నివాళి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 28 : బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో మరణించిన అమరవీరుల సంస్మరణ సభ బుధవారం ఇక్కడి సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీపీఐ జోనల్ కార్యదర్శి వైఎస్ భద్రం పూల మాలలు వేసి నివాళులర్పించారు. వామపక్ష నాయకులు జి.కోటేశ్వరరావు, ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, తాకాశి వెంకటేశ్వరరావు, వీవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి'


అచ్యుతాపురంలో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 28 : బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు పిలుపు నిచ్చారు. బుధవారం ఇక్కడ నాయకులు, కార్యకర్తలతో సభ్యత్వ నమోదు కార్యక్రమంపై ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. సభ్యత్వ నమోదుకు సంబంధించి మండల ఇన్‌చార్జిగా గొంతిన భక్తసాయిరామ్‌ను నియమించారు. పార్టీ మండల అధ్యక్షుడు కూండ్రపు నాయుడు బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అగ్గాల హనుమంతరావు, భీముని జోగినాయుడు, కర్రి సోమునాయుడు,అనురాధ, రామ్మోహన, పీలా శ్రీను, మంజుల, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో...

రాంబిల్లి : బీజేపీ సభ్యత్వ నమోదును నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కారే రాముడు పిలుపునిచ్చారు. రాంబిల్లిలో బుధవారం ఏర్పాటైన మండల స్థాయి సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లోకి వెళ్లి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ సభ్యత్వాలను నమోదు చేస్తూనే మరింత పటిష్టం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సతీష్, నాయకులు ధర్మాల వరహా గోవిందరెడ్డి, నాగమంత్రి శ్రీను, ఉమ్మిడి వెంకటేశ్వరులు, సూరాడ తేజ, కొవిరి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.


రాంబిల్లిలో మాట్లాడుతున్న కారే రాముడు

వరసిద్ధి వినాయక ఆలయం ప్రారంభం


వినాయక ఆలయంలో ప్రగడ తదితరులు పూజలు

ఎలమంచిలి, ఆగస్టు 28 : మునిసిపాలిటీలోని 23వ వార్డు కొక్కిరాపల్లిలో బుధవారం వరసిద్ధి వినాయక ఆలయ ప్రారంభోత్సవ నేత్రపర్వంగా సాగింది. స్థానిక నాయకుడు మజ్జి రాంబాబు, సత్యవతి దంపతులు నిర్మించిన ఈ ఆలయాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ప్రారంభించారు. వేదమంత్రాల నడుమ కౌన్సిలర్ మజ్జి వీరబాబు దంపతులు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కొలుకులూరి విజయ్‌బాబు, గొర్లె నానాజీ, బొద్దపు శ్రీను, నక్కా శివశంకర్, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, నీరుకొండ నరసింగరావు, రాజాన సూర్యనాగేశ్వరరావు, నమ్మి రమణ, పండూరి శ్రీను, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు క్రీడాకారులకు అభినందన సభ

కొత్తూరు, ఆగస్టు 28 : జిల్లా నుంచి అన్ని క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని 2023-2024లో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి, పతకాలు సాధించిన క్రీడాకారులకు గురువారం అభినందన సభ జరగనుందని నేషనల్ బాడీ బిల్డర్ శిలపరశెట్టి బాబీ తెలిపారు. అనకాపల్లి గవరపాలెంలో ఉన్న రైతు భారతి కల్యాణ మండపంలో సాయంత్రం 4.30 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డైట్ విద్యా సంస్థల చైర్మన్ దాడి రత్నాకర్ హాజరు కానున్నారన్నారు. క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

సీఐను కలిసిన కూటమి నాయకులు


సీఐను సత్కరిస్తున్న కూటమి నాయకులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 28 : పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టిన టీవీ విజయ్‌కుమార్‌ను బుధవారం కూటమి నాయకులు కలిసి సత్కరించారు.నాయకుల బీఎస్ఎంకే జోగినాయుడు, మారిశెట్టి భాస్కరరావు, బొడ్డేడ శ్రీనివాసరావు, సూరిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై వినతి


రత్నాకర్‌కు వినతి పత్రం అందిస్తున్న దివ్యాంగులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 28 : దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని కోరుతూ దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు రాపేటి భాస్కర్, వెలగా బుజ్జి, ధనలక్ష్మి, సంతోష్‌లు బుధవారం టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. దివ్యాంగులకు అంత్యోదయ రేషన్‌కార్డులు మంజూరు చేయాలని, కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయించాలని, దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ కార్యాలయం అనకాపల్లిలో ఏర్పాటు చేయాలని, దివ్యాంగుల హక్కుల చట్టం- 2016 తక్షణమే అమలు చేయించాలని, పీటీడీ బస్సుల్లో ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలని కోరారు.

కనకమ్మ ఆలయ గోపుర నిర్మాణం ప్రారంభం


శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే సుందరపు

ఎలమంచిలి, ఆగస్టు 28 : పట్టణంలోని ధర్మవరంలో కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ గోపుర నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావులు వేర్వేరుగా వేర్వేరుగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఆలయ కమిటీ, స్థానిక నాయకులు వీరికి స్వాగతం పలికారు. ఈ పూజా కార్యక్రమాల్లో కూటమి నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌పై నీలినీడలు!

... 5వ పేజీ తరువాయి

ప్రకారం బుధవారం నాటికి 2,867 (17.62 శాతం) ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారు. ఎలమంచిలి సబ్ డివిజన్‌లో 20,982 ఎకరాలకుగాను ఇంతవరకు 9,895 ఎకరాల్లో, పాయకరావుపేట సబ్ డివిజన్‌లో 34,130 ఎకరాలకుగాను 18,307 ఎరాల్లో మాత్రమే వరి నాట్లు వేశారు. పై మూడు సబ్ డివిజన్లతో పోలిస్తే చోడవరం, నర్సీపట్నం సబ్ డవిజన్‌లలో పరిస్థితి కొంత మెరుగ్గా వుంది. ఈ ప్రాంతాల్లో జలాశయాలు వుండడమే ఇందుకు కార ణం. చోడవరం సబ్ డివిజన్‌లో 32,680 ఎకరాలకుగాను 21,137 ఎకరాల్లో, నర్సీపట్నం సబ్ డివిజన్‌లో 28,742 ఎకరాలకుగాను 16,502 ఎకరాల్లో వరినాట్లు వేశారు. కాగా చెరువులపై ఆధారపడి వరి సాగు చేస్తున్న గ్రామాల్లో వరి నారు సిద్ధంగా వున్నప్పటికీ పొలాలను దమ్ము చేయడానికి నీరు అందుబాటులో లేదు. దీంతో వరి నారు ముదిరిపోతోందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

మూడో వంతు విస్తీర్ణంలోనే చెరకు సాగు

జిల్లాలో వరి తరువాత అధిక విస్తీర్ణంలో సాగయ్యేది చెరకు పంట. ఈ ఏడాది సుమారు 40 వేల ఎకరాల్లో చెరకు సాగవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. కానీ ఇప్పటి వరకు 13 వేల ఎకరాల్లో మాత్రమే చెరకు సాగు చేపట్టారు. ఇందులో అత్యధిక భాగం (8,292 ఎకరాలు) గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని చోడవరం, బుచ్చెయ్యపేట, కె.కోటపాడు, చీడికాడ, దేవరాపల్లి మండలాల్లో వుండడం విశేషం. జిల్లాలోని తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ షుగర్ ఫ్యాక్టరీలు మూత పడినప్పటికీ, కొంతమంది రైతులు బెల్లం తయారు చేసుకొనేందుకు ఈ ప్రాంతంలో చెరకు సాగును కొనసాగిస్తున్నారు. దీంతో అనకా పల్లి సబ్ డివిజన్‌లో 2,615 ఎకరాల్లో, ఎల మంచిలి సబ్ డివిజన్‌లో 907 ఎకరాల్లో, సబ్ నర్సీపట్నం డివిజన్‌లో 1,875 ఎకరాల్లో, పాయకరావుపేట సబ్ డివిజన్‌లో 45 ఎకరాల్లో చెరకు పంట సాగులో వుంది.

బదిలీల కోసం...

... 5వ పేజీ తరువాయి

నాయకుల ద్వారా కలెక్టర్‌కు సిఫారసు చేయించారని తెలిసింది.

చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులకు గిరాకీ

నగరంలో పౌర సరఫరాల శాఖలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులకు గిరాకీ ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరంలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్లుగా రావాలని ప్రజాప్రతినిధుల నుంచి పలువురు సిఫారసు లేఖలు సమర్పించారు. నగరంలో పనిచేస్తున్న చెకింగ్ ఇన్‌స్పెక్టర్ ఒకరు 20 మంది డీలర్లను తీసుకుని ఒక ఎమ్మెల్యే వద్దకు వెళ్లి మరీ లేఖ తీసుకున్నారు. ఐదేళ్ల సర్వీస్ దాటినవారు కూడా ఇక్కడే కొనసాగించాలని ఎమ్మెల్యేల నుంచి సిఫారసు లేఖలు తెచ్చుకుంటున్నారు. ఎనిమిది నుంచి పదేళ్లుగా నగరంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లు కూడా కదలడానికి ససేమిరా అంటున్నారు. పలు వివాదాలతో గ్రామీణ ప్రాంతానికి బదిలీ అయిన ఉద్యోగి ఆనందపురం ఆర్ఐగా రావాలని పైరవీ చేస్తున్నారు. ఒకసారి ఆర్ఐగా పనిచేసిన వ్యక్తిని రెండోసారి అదే పోస్టులో నియమించకూడదు. కానీ నగరం నుంచి బియ్యం ఆనందపురం మీదుగా ఇతర ప్రాంతాలకు వెళుతున్నందున అక్కడ పోస్టింగ్ దక్కితే దండిగా సంపాదించుకోవచ్చునని కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పౌర సరఫరాల శాఖలో తిష్ఠ వేసిన ఇన్‌స్పెక్టర్లను సాగనంపాలని రెవెన్యూ ఉద్యోగులు కోరుతున్నారు. చెకింగ్ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న వారిలో పలువురిపై ఆరోపణలు ఉన్నాయి.

'తెలుగు భాష గొప్పది'



ప్రవచనకర్త సందీప్‌శర్మను సత్కరిస్తున్న దృశ్యం

పాయకరావుపేట, ఆగస్టు 28 : సంస్కృతి మన శరీరమైతే.. భాష మన ప్రాణమని, ఈ రెండూ కలిసి ఉన్నప్పుడే పరస్పరం నిలబడతాయని ప్రముఖ శతావధాని, ప్రవచనకర్త తాతా సందీప్‌శర్మ అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో బుధవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ తెలుగు భాష నుంచి ఎంతో గొప్ప సాహిత్యం వచ్చిందన్నారు. తెలుగు సాహిత్యాన్ని విద్యార్థులంతా చదివి తెలుగు భాషలోని సౌందర్యాన్ని గ్రహించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సందీప్ శర్మను ప్రముఖ సినీ రచయిత, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు కేఆర్‌జే.శర్మ తదితరులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీపీగా లక్ష్మి బాధ్యతల స్వీకారం



ఎంపీపీ లక్ష్మిని అభినందిస్తున్న నేతలు, మండల పరిషత్ సిబ్బంది

మాకవరపాలెం, ఆగస్టు 28 : మాకవరపాలెం ఎంపీపీగా ఇప్పటి వరకూ వైస్ ఎంపీపీగా ఉన్న రుత్తల లక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీపీగా ఉన్న రుత్తల సత్యనారాయణ గతనెలలో రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన స్థానంలో వైస్ ఎంపీపీగా ఉన్న లక్ష్మికి ఎంపీపీగా బాధ్యతలు అప్పగిస్తూ జడ్పీ సీఈవో నుంచి ఆదేశాలు మండల పరిషత్‌కు ఆదేశాలు అందాయి. ఇందులో భాగంగానే బుధవారం లక్ష్మి ఎంపీపీ బాధ్యతలు చేపట్టారు. ఆమెను ఎంపీడీవో సీతామహాలక్ష్మి, మాకవరపాలెం ఈవో బాలదొరతో పాటు పంచాయతీ కార్యదర్శులు, మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైసీపీ నేతలు అభినందించారు.

మృతుడి కుటుంబానికి పరిహారం అందజేత



బాధితుడి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న సీఐటీయూ నేతలు

కె.కోటపాడు, ఆగస్టు 28 : ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం, బీమా క్లెయిమ్‌కు అవకాశంతో పాటు కుటుంబ సభ్యుడికి ఉద్యోగం ఇచ్చేందుకు శ్రావణి షిప్పింగ్ యాజమాన్యం అంగీకరించిందని సీఐటీయూ నాయకులు బుధవారం తెలిపారు. విశాఖ పోర్టు శ్రావణి షిప్పింగ్‌లో లారీ క్లీనర్‌గా పనిచేస్తున్న కార్మికుడు కింతాడ కృష్ణను కేఆర్ సన్స్ సంస్థకు చెందిన లారీ ఢీకొనడంతో మృతి చెందాడు. దీంతో కృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆయుష్మాన్ ఆస్పత్రి వద్ద సీఐటీయూ, బాధిత కుటుంబాలు ఆందోళన చేపట్టారు. దీంతో శ్రావణి షిప్పింగ్ యాజమాన్యం రూ.5 లక్షలు నగదుతో పాటు నాలుగు లక్షల రూపాయల చెక్కు మొత్తం కలిపి మొత్తం రూ.తొమ్మిది లక్షలు బాధిత కుటుంబానికి అందజేసిందని సీఐటీయూ నేతలు తెలిపారు. అలాగే కేఆర్ సన్స్ సంస్థలు లారీ నుంచి వచ్చే ఇన్సూరెన్స్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే అదే కంపెనీలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, విశాఖ సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, మరడాన రవి, బుజ్జి, కింతాడ సతీష్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి : సీపీఎం



విద్యుత్ ఉద్యమ అమర వీరులకు నివాళులు అర్పిస్తున్న సీపీఎం నేతలు

గొలుగొండ ఆగస్టు 28 : వ్యవసాయ విద్యుత్ మీటర్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే రైతులు అడ్డుకోవాలని సీపీఎం జిల్లా క్యావర్గ సభ్యుడు డి.వెంకటన్న రైతులకు సూచించారు. మండలంలోని గొలుగొండలో బుధవారం హైదరాబాద్‌లో బషీర్‌బాద్ కాల్పుల్లో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వాములకు నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటైన సమావేశంలో వెంకటన్న మాట్లాడుతూ వ్యవసాయ పంపుసెట్లు, గృహాలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు స్మార్ట్ విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసే సమయాల్లో రైతులు, ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మీటర్లు ఏర్పాటుతో అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కార్పొరేట్ సంస్థలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమ్ముడుపోయాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్మార్టు మీటర్లు ఏర్పాటు ప్రక్రియ రద్దు చేయకుండా వాటిని ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం ప్రజలను, రైతులకు మోసం చేయడమేనన్నారు. రాష్ట్రంలో విద్యుత్ స్మార్టు మీటర్ల ఏర్పాటుపై త్వరలో ఉద్యమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రకమంలో గంగరాజు, భూషణం, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : బషీరాబాగ్ కాల్పుల్లో అమరులైన విద్యుత్ ఉద్యమ అమర వీరులకు బుధవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. 2000, ఆగస్టు 28న హైదరాబాద్‌లోని బషీరాబాగ్‌లో జరిగిన విద్యుత్ ఉద్యమ పోరాటంలో అమరులైన వారిని స్మరించుకున్నారు. సీపీఎం నేతలు బి.టి.దొర, జన్ని దేముడు, ఈశ్వరరావు, పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం



ఎంపీడీవో కార్యాలయం వద్ద కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

నర్సీపట్నం, ఆగస్టు 28 : ఎరువులు, పురుగుల మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలు ఎంపీడీవో కార్యాలయం వద్ద విక్రయించారు. ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ వేములపూడి యూనిట్ సభ్యులు వంకాయలు, బెండకాయలు, టమాటా, ఆకుకూరలు విక్రయించారు. ఏపీ సీఎన్ఎఫ్ ప్రాజెక్టులో భాగంగా ఒక్కో సభ్యురాలు 20 సెంట్లు స్థలంలో 18 రకాల తీగ, దుంప జాతి, ఆకు జాతి కూరలు సాగు చేస్తున్నారని వేములపూడి యూనిట్ ఇన్‌చార్జ్ ఎం.రమ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రమాకుమారి పాల్గొన్నారు.

10 రోజులుగా ఆర్.శివరామపురంలో చీకట్లు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 28 : రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంతో గత పది రోజులుగా ఆర్.శివరామపురంలో చీకట్లో మగ్గుతోంది. ఈ సమస్యపై విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారని గ్రామసులు చందక అప్పలనాయుడు, బర్నికాన ముసలినాయుడు, నమ్మి అప్పారావు తదితరులు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజూ చీకటి పడిన గంటకే విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంతో విద్యాభ్యాసాలకు, ఇళ్లలో వంటలు చేసే మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంలోని ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని మండిపడుతున్నారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి తమ గ్రామంలో విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

ఊరించి.. ఉసూరు మనిపించిన వర్షం



దేవరాపల్లి, ఆగస్టు 28 : ఇటీవల చినుకు జాడ కరువైంది. ఈ నేపథ్యంలో బుధవారం ఆకాశంలో కారుమబ్బులు కమ్మి భారీ వర్షం వచ్చే సూచనలు కనిపించడంతో రైతులు ఎంతో ఆనందపడారు. అయితే అంతలోనే భారీ గాలులు వీయడంతో అంతలోనే మబ్బులు మాయమై వర్షం పడలేదు. చిటపట చినుకులు మాత్రం పడ్డాయి. దీంతో ఈ ప్రాంతీయులు ఊసూరుమన్నారు.

కె.కోటపాడులో కంపుకంపు

- పారిశుధ్య నిర్వహణను గాలికొదిలేశారు
- నెలల తరబడి కాలువల్లో పూడిక తీయని పరిస్థితి
- ఎక్కడికక్కడే నిలిచిపోతున్న మురుగునీరు
- పంచాయతీ తీరుపై గ్రామస్థుల అసంతృప్తి

కె.కోటపాడు, ఆగస్టు 28 : మండల కేంద్రంలో మురుగునీటి కాలువల నిర్వహణ సరిగా లేకపోవడంతో ఎక్కడికి వెళ్లినా దుర్వాసన కొడుతోంది. కాలువల్లో నెలల తరబడి పూడికలు తీయడం లేదు. ప్రతి వీధిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కంచరవీధిలో ఉన్న కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగు నీరు వెళ్లే



పూడిక తీయకపోవడంతో నిలిచిన మురుగునీరు

మార్గం లేక మురుగునీరు నిలిచిపోతోంది. దీంతో ఆ ప్రాంతమంతా కంపు కొడుతోంది. పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ సిబ్బంది ఏ మాత్రం శ్రద్ధ వహించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం నెలకు ఒకసారైనా కాలువల్లో పూడిక తీయడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇంటి పన్నులు వసూలుపై ఉన్న శ్రద్ధ గ్రామ పరిశుభ్రతపై లేదని పంచాయతీ సిబ్బంది చూపడం లేదంటూ పలువురు విమర్శిస్తున్నారు. అలాగే ప్రధాన వీధుల్లో ఉన్న కాలువలు, రామకోవెల వద్ద ఉన్న అంగన్‌వాడీ భవనాల సమీపంలో ఉన్న డ్రైనేజీల్లో మురుగు నీరు ఎటూ వెళ్లే అవకాశం లేక అక్కడే నిలిచిపోతోంది. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో దోమలు అధికమై ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే కాలువల్లో చెత్తాచెదారాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

రిజర్వ్ ఫారెస్టులో టేకు చెట్లు నరికివేతపై ఫిర్యాదు



టేకు చెట్టు నరుక్కుపోగా మిగిలిన మాను



టేకు దుంగలు పట్టుకు పోగా పడి ఉన్న కొమ్మలు

నర్సీపట్నం, ఆగస్టు 28 : నాతవరం సెక్షన్‌లో నిషేధిత రిజర్వ్ ఫారెస్టులో టేకు చెట్లు నరికివేతపై దళిత ప్రగతి ఐక్య సంఘం నాయకుడు కొండ్రు మరిడయ్య అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గత కొంతకాలంగా ఈ ప్రాంతం నుంచి స్మగ్లర్లు కలపను అక్రమంగా తరలిస్తున్నారని, ఇందుకు అటవీ సిబ్బంది నుంచి అక్రమార్కులకు సహాయసహకారాలు అందుతున్నాయని ఆయన ఆరోపించారు.

నాతవరం అటవీ సెక్షన్ వెదురుపల్లి బీట్ పరిధిలోని వెదురుపల్లి, కృష్ణాపురం, అచ్చంపేట, సుందరకోట రిజర్వ్ ఫారెస్టులో 20 రోజుల క్రితం భారీగా టేకు చెట్లు నరికి కలపను అక్రమంగా తరలించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. టేకు చెట్లు నరికి కలప పట్టుకుపోగా, మిగిలిన చిన్న చిన్న కొమ్మలు వదిలేశారు. కలప అక్రమ వ్యాపారులకు అటవీ సిబ్బంది ఇతోధికంగా సహకారం అందిస్తున్నారని నాతవరం మండలం గుణిపూడికి చెందిన దళిత ప్రగతి ఐక్య సంఘం నాయకుడు కొండ్రు మరిడయ్య ఆరోపించారు. దీనిపై అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చినా పట్టించుకోలేదని అంటున్నారు.

అయితే బుధవారం నర్సీపట్నం రేంజర్ లక్ష్మీనర్సు ఆయా బీట్‌లు పరిశీలించారు. కృష్ణాదేవిపేట రేంజ్ పరిధిలోని సుందరకోట బీటులో చెట్లు నరికిన విషయాన్ని నర్సీపట్నం రేంజర్ గమనించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఈ వ్యవహారంపై అటవీ శాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

పూర్తి స్థాయిలో శాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్లు

- ఎంపీడీవో అప్పలరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అప్పలరాజు

కె.కోటపాడు, ఆగస్టు 28 : శాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్లను పూర్తి స్థాయిలో నిర్వహించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సబ్బి అప్పలరాజు కోరారు. పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో బుధవారం సమీక్ష సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ సెప్టెంబరు 1న పింఛన్లను సక్రమంగా పంపిణీ చేయాలని, పంచాయతీ కార్యాలయాల్లో ఈ సర్వీసు సంబంధించిన సొమ్మును ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఖాతాకు జమ చేయాలని కోరారు. అలాగే తాగునీరు, పారిశుధ్యంకు సంబంధించిన అన్ని విషయాలపై తగు శ్రద్ధ తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని సచివాలయాల పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టుతో బహుళ ప్రయోజనాలు : ఎంపీడీవో



వానపాములు విడుదల చేస్తున్న సర్పంచ్ లక్ష్మి

దేవరాపల్లి, ఆగస్టు 28 : సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేసుకొని పంటలకు ఉపయోగించినట్టయితే అధిక ఆదాయం పొందవచ్చని ఎంపీడీవో చంద్రశేఖర్ పేర్కొన్నారు. రైవాడలో సంపద కేంద్రంలో వానపాములను సర్పంచ్ చల్లా లక్ష్మి చేతుల మీదుగా బుధవారం విడుదల చేశారు. గర్నింగి, ఎం.అలమండ గ్రామాల్లో రైతులకు వర్మీ కంపోస్టు వినియోగంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పి.సన్యాసినాయుడు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోండి

- రెవెన్యూ కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళన
- తహసీల్దార్ హామీతో విరమణ

రోలుగుంట, ఆగస్టు 28 : రీ-సర్వేకు ముందు ఆన్‌లైన్‌లో ఉన్న భూమిని వెబ్‌ల్యాండ్‌లో తొలగించి మొత్తం భూమిని ఒకే కూతురుపై నమోదు చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చిన వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఉదయం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధిత రైతు రెడ్డి తాతీలు తన ఇద్దరు కూతుర్లతో నిరసన చేపట్టారు. తనకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను వేడుకున్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబం

బుచ్చెంపేట గ్రామ రెవెన్యూలో సర్వే నెంబర్లు 73, 74, 70-3, 72-1, 142లలో మొత్తం 3.10 సెంట్లు భూమి ఉన్నదని, తనతో పాటు తన ఇద్దరు కూతుళ్లు సామిరెడ్డి రమణమ్మ, గాలి రమణమ్మలకు వాటాలు ఇవ్వకుండా తన మరో కుమార్తె రెవెన్యూ అధికారులకు లంచాలు ఇచ్చి తప్పుడు పాసుపుస్తకాలు తయారు చేసుకున్నారన్నారు. దీనికి స్థానిక రెవెన్యూ అధికారులు సహకరించారని రెడ్డి తాతీలు ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. రీ-సర్వేలో గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్లు లంచాలు తీసుకుని మొత్తం భూమిని తన పెద్దకూతురైన పోతల లక్ష్మి పేరుమీద ఆన్‌లైన్ చేసి పాస్ పుస్తకాలు జారీ చేశారన్నారు. వీటిని రద్దు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

విచారణ చేపతాం : తహసీల్దార్

దీనిపై తహసీల్దార్ వరహాలు స్పందించి బాధితులతో మాట్లాడారు. గ్రామంలో బహిరంగ విచారణ చేపట్టి, ఇరు వర్గాలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇరు వర్గాల భూరికార్డులు పరిశీలించి విచారిస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు నిరసన విరమించారు.

ఎస్సీ హాస్టల్ భవనంలో అసాంఘిక కార్యకలాపాలపై ఎస్పీకి ఫిర్యాదు

రోలుగుంట, ఆగస్టు 28 : స్థానిక జడ్పీ హైస్కూల్ పక్కన ఉన్న నిరుపయోగంగా ఉన్న ఎస్సీ హాస్టల్ భవనం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని, దీనిపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకుని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతూ జిల్లా ఎస్పీ దీపికకు మండల ఐటీడీపీ కన్వీనర్ బనికెల సురేష్‌కుమార్ కోరారు. కొందరు ఆకతాయిలు, మందుబాబులు ఈ భవనంలో మద్యం తాగడం, ధూమపానం, పేకాట ఆడడం, గంజాయి సేవించడం వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనివల్ల పాఠశాల పిల్లలు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై దృష్టి సారించి వినియోగంలోకి తీసుకువచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఖరీఫ్‌పై నీలినీడలు!

... 5వ పేజీ తరువాయి

ప్రకారం బుధవారం నాటికి 2,867 (17.62 శాతం) ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారు. ఎలమంచిలి సబ్ డివిజన్‌లో 20,982 ఎకరాలకుగాను ఇంతవరకు 9,895 ఎకరాల్లో, పాయకరావుపేట సబ్ డివిజన్‌లో 34,130 ఎకరాలకుగాను 18,307 ఎరాల్లో మాత్రమే వరి నాట్లు వేశారు. పై మూడు సబ్ డివిజన్లతో పోలిస్తే చోడవరం, నర్సీపట్నం సబ్ డవిజన్‌లలో పరిస్థితి కొంత మెరుగ్గా వుంది. ఈ ప్రాంతాల్లో జలాశయాలు వుండడమే ఇందుకు కారణం. చోడవరం సబ్ డివిజన్‌లో 32,680 ఎకరాలకుగాను 21,137 ఎకరాల్లోనర్సీపట్నం సబ్ డివిజన్‌లో 28,742 ఎకరాలకుగాను 16,502 ఎకరాల్లో వరినాటు వేశారు. కాగా చెరువులపై ఆధారపడి వరి సాగు చేస్తున్న గ్రామాల్లో వరి నారు సిద్ధంగా వున్నప్పటికీ పొలాలను దమ్ము చేయడానికి నీరు అందుబాటులో లేదు. దీంతో వరినారు ముదిరిపోతోందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

మూడో వంతు విస్తీర్ణంలోనే చెరకు సాగు

జిల్లాలో వరి తరువాత అధిక విస్తీర్ణంలో సాగయ్యేది చెరకు పంట. ఈ ఏడాది సుమారు 40 వేల ఎకరాల్లో చెరకు సాగవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. కానీ ఇప్పటి వరకు 13 వేల ఎకరాల్లో మాత్రమే చెరకు సాగు చేపట్టారు. ఇందులో అత్యధిక భాగం (8,292 ఎకరాలు) గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని చోడవరం, బుచ్చెయ్యపేట, కె.కోటపాడు, చీడికాడ, దేవరాపల్లి మండలాల్లో వుండడం విశేషం. జిల్లాలోని తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ షుగర్ ఫ్యాక్టరీలు మూత పడినప్పటికీ, కొంతమంది రైతులు బెల్లం తయారు చేసుకొనేందుకు ఈ ప్రాంతంలో చెరకు సాగును కొనసాగిస్తున్నారు. దీంతో అనకాపల్లి సబ్ డివిజన్‌లో 2,615 ఎకరాల్లో, ఎలమంచిలి సబ్ డివిజన్‌లో 907 ఎకరాల్లో, సబ్ నర్సీపట్నం డివిజన్‌లో 1,875 ఎకరాల్లో, పాయకరావుపేట సబ్ డివిజన్‌లో 45 ఎకరాల్లో చెరకు పంట సాగులో వుంది.

రైతులతో రెవెన్యూ చెలగాటం

... 5వ పేజీ తరువాయి

వీలులేదు. అయితే దొప్పెర్ల పంచాయతీ పరిధిలో రెవెన్యూ అధికారుల అనాలోచిత చర్యల కారణంగా 50 మందికిపైగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బార్క్‌కు రహదారి నిమిత్తం పలు సర్వే నంబర్లలో 90 ఎకరాల వరకు సేకరించగా, అవే సర్వే నంబర్లలో మిగిలిన భూమిని కూడా 22 (ఏ) జాబితాలోనే వుంచేశారు. ఉదాహరణకు కొల్లి పైడిరాజు కుటుంబ సభ్యులకు సర్వే నంబర్లు 28, 32, 34, 103లలో 9 ఎకరాల 13 సెంట్ల భూమి వుంది. బార్క్‌కి రోడ్డు కోసం మూడు ఎకరాల 9 సెంట్లు సేకరించారు. నష్టపరిహారం కూడా ఇచ్చేశారు. అయితే ఈ సర్వే నంబర్లలో మిగిలిన ఆరు ఎకరాలను కూడా 22 (ఏ)లో చేర్చారు. దీంతో బార్క్‌కి ఇవ్వగా మిగిలిన భూమిని అమ్ముకోవడానికి వీలులేకపోయిందని పైడిరాజు కుటుంబ సభ్యులు వాపోతున్నారు. కొరుప్రోలు సన్నిబాబు కుటుంబానికి వివిధ సర్వే నంబర్లలో ఎకరా 45 సెంట్ల భూమి వుంది. బార్క్ రోడ్డు కోసం వీరి భూమిని తీసుకోలేదు. కానీ ఇదే సర్వే నంబరులో ఉన్న వేరొక రైతు భూమిని తీసుకున్నారు. కానీ సర్వే నంబర్ అంతటినీ అధికారులు 22 (ఏ)లో చేర్చేశారు. దీంతో భూమిని అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడింది. కొల్లి వరహాలరావుకి 4.27 ఎకరాల భూముంది. ఇందులో 27 సెంట్లు మాత్రమే బార్క్ రోడ్డు కోసం సేకరించారు. కాని సర్వే నంబర్‌లో వున్న మొత్తం భూమిని 22 (ఏ)లో చేర్చారు. ఈ విధంగా సుమారు 50 మంది రైతులకు చెందిన వంద ఎకరాల భూములు 22 (ఏ)లో చేరడంతో క్రయవిక్రయాలు జరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సబ్‌డివిజన్ చేస్తే సమస్య పరిష్కారం

బార్క్‌కు రహదారి కోసం సేకరించిన వివిధ సర్వే నంబర్లలోని భూములను ఆనాడే సబ్‌డివిజన్ చేస్తే సమస్య పరిష్కారం అయ్యేదని అధికారులు అంటున్నారు. బార్క్ కోసం ఏపీఐఐసీ అధికారులు సేకరించిన భూములను సబ్‌డివిజన్ చేయకుండా సర్వే నంబర్లను రిజిస్ట్రేషన్ శాఖకు ఇవ్వడం వల్ల వీటిని ప్రభుత్వ భూములుగా పేర్కొంటూ 22 (ఏ) జాబితాలో నమోదు చేశారు. సబ్ డివిజన్ చేయాలని 18 సంవత్సరాల నుంచి ఏపీఐఐసీతో పాటు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆయా రైతులు ఆరోపిస్తున్నారు.

మనవడి ఉన్నత విద్యకు పొలం అమ్ముకోలేని పరిస్థితి

- కొల్లి పైడిరాజు, దొప్పెర్ల



నాకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె కొడుకు బీటెక్ పూర్తిచేశాడు. యూకేలో ఎంఎస్ చేయాలనుకుంటున్నాడు. ఇందుకు రూ.30 లక్షలు అవసరం అవుతాయి. దొప్పెర్లలో సెంటు భూమి ప్రస్తుతం రూ.2 లక్షలు పలుకుతోంది. మాకున్న భూమిలో కొంత అమ్మి చదివిద్దామంటే 22(ఏ)లో చేర్చడం వల్లకుదరడం లేదు. ప్రైవేటు వ్యక్తులకు తనఖా పెడదామంటే ఎవరూ ముందుకు రావడంలేదు.

ప్రభుత్వమే న్యాయం చేయాలి

- కొరుప్రోలు అమ్మాజీ, దొప్పెర



నా తల్లిదండ్రులు వృద్ధాప్యంతోపాటు అనారోగ్యంతో బాధపడుతున్నారు. తమ్ముడు గతంలోనే చనిపోయాడు. చెల్లెలు దివ్యాంగురాలు. మాకు ఈ భూమే ఆదారం. కొంత భూమిలో జీడిమామిడి తోట వుంది. మిగతా భూమి కాళీగా ఉంది. నాన్నకు, చెల్లికి వచ్చే పెన్షనే మాకు జీవనాధారం. ఇల్లు శిథిలావస్థకు చేరింది. కొంతభూమి అమ్ముకుని ఇల్లు నిర్మించకుందా మంటే విక్రయించడానికి వీలు లేకపోయింది. ప్రభుత్వం స్పందించి మా భూములకు 22 (ఏ) నుంచి విముక్తి కల్పించాలి.

సంక్షిప్తంగా..

నేడు మరిడిమాంబ పండగ



కృష్ణాదేవిపేట, ఆగస్టు 28 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం, గైరంపేట, పాతకృష్ణాదేవిపేట గ్రామాల్లో గురువారం గ్రామదేవతైన మరిడిమాంబ అమ్మవారి పండగ నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఏఎల్‌పురంలో విద్యుత్ అలంకరణతో పాటు ఆలయానికి, అమ్మవారి విగ్రహానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. భక్తులకు అవసరమైన వసతులు కల్పిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. బుధవారం రాత్రి నుంచే గ్రామంలో అమ్మవారి గరగరలు ఊరేగింపు కార్యక్రమాలతో పండగ ప్రారంభించారు. పండగ సందర్భంగా ఏఎల్‌పురంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ అమ్మవారి పండుగలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

మధ్యాహ్నం భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు : ఎంఈవో



తురకలపూడిలో మిడ్ మీల్స్‌ని పరిశీలిస్తున్న ఎంఈఓ కాశీ విశ్వేశ్వరరావు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 28 : మధ్యాహ్న భోజనం అమలులో నాణ్యత లోపిస్తే శాఖాపరమైన చర్యలకు గురికావలసి వస్తుందని ఎంఈవో కాశీవిశ్వేశ్వరరావు హెచ్చరించారు. ఆయన బుధవారం తురకలపూడి జడ్పీ సూల్స్‌లో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వంటపాత్రలను శుభ్రంగా ఉంచాలని, మెనూ మేరకు నాణ్యత భోజనం తయారు చేసి విద్యార్థులకు పెట్టాలని ఎంఈవో మిడ్ డే మీల్స్ అమలు ఏజెన్సీ సభ్యురాలకు స్పష్టం చేశారు. హెచ్ఎం ఎం.రవీంద్రబాబు, ఉపాధ్యాయులు టీవీ రమణ, ఎంవీ నూకేష్ పాల్గొన్నారు.

మళ్లీ గోకులాలు!

... 5వ పేజీ తరువాయి

పనులు జరిగిన 788 మినీ గోకులాల పనుల పూర్తికి అనుమతించారు. కాగా 25 శాతం కంటే తక్కువ పనులు అయిన వాటిని పూర్తిచేసేందుకు ఏడాది తరువాత ప్రభుత్వం అనుమతించింది. అయితే బిల్లులు వస్తాయో..రావోనన్న అనుమానంతో 421 మంది రైతులు ఈ పథకం నుంచి వైదొలిగారు. మిగిలిన 1,683 మంది పనులు చేపట్టారు. నెలలు గడిచినా బిల్లులు రాలేదు. పలువురు రైతులు స్పందనలో అర్జీలు అందజేశారు. ఎట్టకేలకు స్పందించిన అప్పటి ప్రభుత్వం అరకొరగా నిధులు విడుదల చేసింది. కనీసం నాలుగో వంతు మంది లబ్ధిదారులకు కూడా నిధులు అందలేదు. పైగా 'పాన్' కార్డు వుంటేనే బిల్లులు మంజూరు చేస్తామని నిబంధన విధించడంతో కొద్ది మందికి మాత్రమే రాయితీ సొమ్ము అందింది.

పథకం పునరుద్ధరణ

రెండున్నర నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం... పశుపోషణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని గోకులాల పథకాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించింది. పశువులతోపాటు జీవాలు, కోళ్లకు కూడా షెడ్లు నిర్మించుకునే వెసులుబాటు కల్పించింది. గోకులాల పథకంలో పశువులకు మూడు రకాలు, గొర్రెలు/ మేకలు, కోళ్లకు రెండు రకాల షెడ్లు నిర్మించుకోవచ్చు. రెండు పశువుల కోసం నిర్మించే షెడ్డు విలువ రూ.1,15,000, నాలుగు పశువుల కోసం నిర్మించే షెడ్డు ఖర్చు రూ1,85,000, అరు పశువులకు షెడ్డు కోసం రూ.2,30,000లుగా నిర్ధారించారు. 90 శాతం సబ్సిడీ పోను 10 శాతం రైతులు భరించాల్సి ఉంటుంది. ఇక 20 గొర్రెలు/ మేకల కోసం రూ1,30,000, ఒకవేళ 50 జీవాలు ఉంటే రూ2,30,000 ఖర్చు అవుతుంది. ఇందులో రైతులు 30 శాతం ఖర్చు భరించాలి. కోళ్లకు షెడ్డు నిర్మించుకునేందుకు వంద కోళ్లకు రూ 87,000 అవుతుంది. ఇందులో రూ 28,100 రైతులు భరించాలి. 200 కోళ్లషెడ్డు విలువ రూ.1,32,000. ఇందులో రైతులు భరించాల్సిన ఖర్చు రూ39 వేలు. ఈ పథకం కింద షెడ్లు నిర్మించుకోవాలనుకునే రైతులు సమీపంలోని గ్రామ సచివాలయాల్లో పశు సంవర్థక సహాయకులను సంప్రదించి, దరఖాస్తు చేసుకోవాలి.

బదిలీల కోసం...

... 5వ పేజీ తరువాయి

నాయకుల ద్వారా కలెక్టర్‌కు సిఫారసు చేయించారని తెలిసింది.

చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులకు గిరాకీ

నగరంలో పౌర సరఫరాల శాఖలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులకు గిరాకీ ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరంలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్లుగా రావాలని ప్రజా ప్రతినిధుల నుంచి పలువురు సిఫారసు లేఖలు సమర్పించారు. నగరంలో పనిచేస్తున్న చెకింగ్ ఇన్‌స్పెక్టర్ ఒకరు 20 మంది డీలర్లను తీసుకుని ఒక ఎమ్మెల్యే వద్దకు వెళ్లి మరీ లేఖ తీసుకున్నారు. ఐదేళ్ల సర్వీస్ దాటినవారు కూడా ఇక్కడే కొనసాగించాలని ఎమ్మెల్యేల నుంచి సిఫారసు లేఖలు తెచ్చుకుంటున్నారు. ఎనిమిది నుంచి పదేళ్లుగా నగరంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లు కూడా కదలడానికి ససేమిరా అంటున్నారు. పలు వివాదాలతో గ్రామీణ ప్రాంతానికి బదిలీ అయిన ఉద్యోగి ఆనందపురం ఆర్ఐగా రావాలని పైరవీ చేస్తున్నారు. ఒకసారి ఆర్ఐగా పనిచేసిన వ్యక్తిని రెండోసారి అదే పోస్టులో నియమించకూడదు. కానీ నగరం నుంచి బియ్యం ఆనందపురం మీదుగా ఇతర ప్రాంతాలకు వెళుతున్నందున అక్కడ పోస్టింగ్ దక్కితే దండిగా సంపాదించుకోవచ్చునని కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పౌర సరఫరాల శాఖలో తిష్ఠ వేసిన ఇన్‌స్పెక్టర్లను సాగనంపాలని రెవెన్యూ ఉద్యోగులు కోరుతున్నారు. చెకింగ్ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న వారిలో పలువురిపై ఆరోపణలు ఉన్నాయి.